జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*


చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్తు, దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 72 | హైదరాబాద్, డిసెంబర్ 31 గురువారం 2020 | 8 పేజీలు | వెల : 5.00

# పారిశ్రామిక కారిడార్లతో 2.8 లక్షల ఉద్యోగాలు

## కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

న్యూఢిల్లీ,డిసెంబర్ 30, ప్రజాపాలన : మోదీ ప్రభుత్వం రూ. 7,725 కోట్లతో పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుకు ఆమోదం తెలపడంపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హర్షం వ్యక్తం చేశారు. ప్రధానికి అభినందనలు తెలిపారు. పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో 2.8 లక్షల మందికి ఉపాధి లభించనున్నట్టు ఆయన చెప్పారు. కేంద్ర మంత్రి వర్గం బుధవారం ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో మూడు పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసింది. ఏపీలోని కృష్ణపట్నం, కర్ణాటల తుముకూరులో పారిశ్రామిక కారిడార్లతో పాటు గ్రేటర్ నొయిడాలోని మల్టీ మోడల్ లాజిస్టిక్స్ హబ్ అండ్ మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌లకు కేంద్రం అనుమతి తెలిపింది. అనంతరం అమిత్‌షా మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని నిర్ణయం ప్రశంసనీయమని అన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల ఆత్మనిర్భర్ భారత్‌కు మరింత ఉత్తేజం కలగడంతో పాటు, దేశవ్యాప్తంగా పెట్టుబడులకు మరింత ఊతం లభిస్తుందని చెప్పారు. కాగా, పారిశ్రామిక కారిడార్ ఏర్పాటులో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయని, తయారీరంగంలో పెట్టుబడుల ఆకర్షణకు అవకాశం ఉంటుందని మరో కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్ తెలిపారు. లాజిస్టిక్‌ల ఖర్చు తగ్గడంతో పాటు నిర్వహణ సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు.

కేబినెట్ నిర్ణయాలు..

మూడు పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో పాటు ఆకాశ్ మిసైల్ సిస్టమ్



ఎగుమతికి కూడా కేబినెట్ బుధవారంనాడు ఆమోద ముద్ర వేసింది. మూడు పారిశ్రామిక కారిడార్లను రూ. 7,725 కోట్లతో నిర్మించేందుకు నిర్ణయించింది. భారత్-భూటాన్ మధ్య శాంతి భద్రతలకు సంబంధించిన ఎంవోయూకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

# కోనేరు కోనప్పను అభినందించిన కేసీఆర్

హైదరాబాద్,డిసెంబర్ 30, ప్రజాపాలన : కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజక వర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్పను ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు అభినందించారు. కోనప్ప కుటుంబ సభ్యులు బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలుసుకున్నారు. నియోజక వర్గంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ప్రతి రోజూ 1000 మందికి అన్న దానం చేయడం, స్కూళ్లకు టీవీలు అందజేయడం, టీచర్- పోలీసు- మిలిటరీ ఫారెస్టు పోస్టులకు దరఖాస్తుచేసుకున్న వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వడం , ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్నభోజనం పెట్టడం, రక్తహీనత ఉన్న మహిళలకు పోషకాహారం అందించడం,



ఎస్సీ, ఎస్టీలకు సామూహిక వివాహాలు జరిపించడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని సీఎం అభినందించారు. నియోజక వర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్నందుకు ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కోనప్ప కృతజ్ఞతలు తెలిపారు.

**ముదోల్ నియోజక వర్గంలో అభివృద్ధి పనులు సత్వరం పూర్తిచేయండి**

ముదోల్ నియోజక వర్గం పరిధిలో పలు అభివృద్ధిపనులను సత్వరం పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే జి. విఠల్‌రెడ్డి బుధవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి పలు అంశాలను ప్రస్తావించారు. వీటిపై సీఎం సానుకూలంగా స్పందించారు.

మిగతా 2లో..

# కేంద్రానికి లేఖ రాసిన కేటీఆర్

హైదరాబాద్,డిసెంబర్ 30, ప్రజాపాలన : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పురపాలక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాలకు కేంద్ర బడ్జెట్లో పెద్దఎత్తున నిధులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కే. తారకరామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర పట్టణ వ్యవహారాలు మరియు హౌసింగ్ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక ఇంజన్ అయిన రాజధాని హైదరాబాద్ నగరంలో అనేక వినూత్నమైన కార్యక్రమాలను చేపడుతున్నామని మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో తెలిపారు. దీర్ఘకాలికంగా హైదరాబాద్ నగర అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లేందుకు హైదరాబాద్ అర్బన్ అగ్లోమరేశన్ ఏరియా పేరిట వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంప్రహెన్సివ్ సివరేజ్ మాస్టర్ ప్లానింగ్ దిశగా ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రక్క ప్రణాళికతో ముందుకు పోతుందని తెలిపారు. ఈ మాస్టర్ ప్లాన్ కోసం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రణాళిక,సర్వే, డిజైన్, అంచనాలు నిర్దారణ వంటి కార్యక్రమాలను పూర్తి చేసిందని, ఈ మాస్టర్ ప్లాన్ లో భాగంగా మూడు ప్యాకేజీల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ మాస్టర్ ప్లాన్ లో భాగంగా సివరెజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ లతోపాటు మురికి నీటి ట్రంక్ లైన్ల ఏర్పాటు వంటి వాటితో డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కొద్ది రోజుల క్రితం జాతీయ హరిత ట్రిబ్యునల్ మూసీ నది కాలుష్యాన్ని అరికట్టే చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఆదేశాల మేరకు, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మాస్టర్ ప్లాన్ కి ప్రాధాన్యత ఇనస్తున్నామని తెలివింది. యస్టిపిలతోపాటు సివరేజ్ కలక్షన్ నెట్వర్క్ ట్రంక్, సివర్ లైన్ల నెట్వర్క్



మొత్తం 2232 కిలోమీటర్ల మేర ఉండే అవకాశం ఉందని, వీటి కోసం సుమారు 3722 కోట్ల రూపాయలతో 36 నెలల్లో పనులు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, అయితే ఈ కాంప్రహెన్సివ్ సివరేజ్ మాస్టర్ ప్లాన్ కి కేంద్ర ప్రభుత్వం రానున్న బడ్జెట్లో కనీసం 20 శాతం నిధులను అంటే సుమారు 750 కోట్ల రూపాయలను కేటాయించాలని కోరారు.

మిగతా 2లో..

# చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయండి:ఇంద్రకరణ్ రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని చిత్తడి నేలలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. అరణ్య భవన్ లో వెట్ ల్యాండ్ అథారిటీ మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవవైవిధ్యానికి నెలవైన ప్రాంతాలను పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, తద్వారా చిత్తడి నేలల పరిరక్షణతో వాటి సంరక్షణకు మరింత భరోసా దొరుకుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న చిత్తడి నేలలను గుర్తించే ప్రక్రియను ప్రారంభించి వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులచే సాంకేతిక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల నుంచే ఫిర్యాదులను కూడా పరిశీలించాలని చెప్పారు. పర్యావరణ, సాగునీరు, రెవెన్యూ, మత్స్య, అటవీ, తదితర శాఖల సమన్వయంతో స్థానికంగా ఉన్న చిత్తడి నేలలను గుర్తించి,

మిగతా 2లో..

# ఐటీ రిటర్న్ దాఖలు గడువు పొడిగించిన కేంద్రం




హైదరాబాద్ : ఐటీ రిటర్న్ దాఖలుకు కేంద్ర ప్రభుత్వం గడువు పొడిగించింది. వ్యక్తిగత చెల్లింపులకు 10 రోజుల గడువు ఇచ్చింది. వ్యక్తిగత చెల్లింపుదారులు జనవరి 10 వరకు ఐటీ రిటర్న్ దాఖలు చేయాలని సూచించింది. అదేవిధంగా సంస్థలు తమ ఐటీ రిటర్నులు దాఖలు చేసేందుకు 15 రోజులు గడువును పెంచింది. ఫిబ్రవరి 15లోపు రిటర్న్‌లు దాఖలు చేయాలని ఆయా సంస్థలకు సూచించింది. కరోనా నేపథ్యంలో గతంలోనూ పలుమార్లు ఐటీ రిటర్న్ దాఖలు గడువును పొడిగించిన విషయం తెలిసిందే.

# రాష్ట్రంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి జరుగుతోంది:ఎర్రబెల్లి



వరంగల్ రూరల్: రాష్ట్రంలో గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి సీఎం కేసీఆర్ నేతృత్వంలో జరుగుతోందని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రైతులకు సీఎం చే సినంతగా ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం , ఏ నాయకుడూ చేయలేదన్నారు. తెలంగాణలో రైతుల కోసం అమలు అవుతున్న అన్ని పధకాలు దేశంలో మరే రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి కాబట్టే రైతుల సంక్షేమానికి ఆయన విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించిన మంత్రి ఎర్రబెల్లి రూ. 1 కోటి 50లక్షల 50వేల విలువైన పలు అభివృది? కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అలాగే రైతు వేదికలు, పల్లె ప్రకృతి వనాలు, గ్రామపంచాయతీ భవనాలు, గ్రామ పంచాయితీ షాపింగ్ కాంపెక్స్‌ల భవనాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా అడుగడుగునా మంత్రికి రైతుల నుంచి స్వాగతం లభించింది.

మిగతా 2లో..

# రిపబ్లిక్ డే పరేడ్‌లో భారీ మార్పులు




న్యూఢిల్లీ,డిసెంబర్ 30, ప్రజాపాలన : కరోనా మహమ్మారి కారణంగా 2021 రిపబ్లిక్ డే పరేడ్‌లో భారీ మార్పులు చేసింది కేంద్ర ప్రభుత్వం. రిపబ్లిక్ డే చరిత్రలో తొలిసారి పరేడ్ ఎర్ర కోట కంటే ముందే ముగియనున్నది. ఈసారి విజయ్ చౌక్ నుంచి నేషనల్ స్టేడియం వరకే పరేడ్ ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈసారి ఇంకా ఏం మార్పులు చేసిందో ఒకసారి చూద్దాం.

పరేడ్ ప్రతిసారి 8.2 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కానీ ఈసారి మాత్రం అది 3.3 కిలోమీటర్లకే పరిమితం కానున్నది.

పరేడ్‌లో పాల్గొనే అందరూ కచ్చితంగా మాస్కులు ధరించాల్సిందే.

ఈసారి పరేడ్‌లో ఉండే బృందాల్లో సభ్యుల సంఖ్యను కూడా 144 మంది నుంచి 96కు తగ్గించారు.

ఇక ఈ రిపబ్లిక్ డే వేడుకలను చూడటానికి ప్రతి ఏటా భారీగా ప్రజలు తరలి వస్తారు. గతంలో సుమారు లక్షా 15 వేల మందికి ఈ అవకాశం ఉండేది. కానీ ఈసారి మాత్రం కేవలం 25 వేల మందికే అనుమతిస్తున్నారు. 15 ఏళ్లలోపు వయసు ఉన్న వారికి అనుమతి లేదని కేంద్రం స్పష్టం చేసింది. ఈసారి రిపబ్లిక్ డే వేడుకలకు బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించింది భారత ప్రభుత్వం. యూకేలో కొత్త రకం కరోనా వైరస్ వ్యాప్తి ఎక్కువ అవుతున్నా.. జాన్సన్ మాత్రం ఈ వేడుకల్లో హాజరవుతున్నారని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)
MASTER KEY TV NEWS FOR EQUALITY
జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ
బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం
1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.
సంప్రదించండి
Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

## డిసెంబర్ 31 అర్ధ రాత్రి వేడుకల్లో నియమాలు అతిక్రమించొద్దు:జిల్లా ఎస్పి ఎం.నారాయణ

వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 30 ( ప్రజాపాలన ) : డిసెంబర్ 31 అర్ధ రాత్రి వేడుకల్లో పోలీస్ అధికారుల సలహాలు సూచనలు పాటించని వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లాఎస్.పి. ఎం.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.. ముందుగా జిల్లా ప్రజలకు, జిల్లా పోలీస్ సిబ్బందికి మరియు ఎలెక్ట్రానిక్ %డ% ప్రింట్ మీడియా మిత్రులకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడము జరిగినది. కోవిడ్19 విజృంబిస్తున్న కారణంగా ప్రజలు గుంపులు గుంపులుగా చేరి రోడ్లపై వేడుకలు జరపకూడదు. డిజే మరియు సౌండ్ బాక్స్ లకు, పెద్ద పెద్ద శబ్దాలకు ఎలాంటి అనుమతులు లేవు. రిసార్ట్ మరియు ఫామ్ హౌస్ లపై ప్రత్యేకమైన నిఘా వుంటుంది. రిసార్ట్ మరియు ఫార్మ్ హౌస్ లలో ఎలాంటి అశ్లీలత కార్యక్రమాలు జరపకూడదు. మద్యం త్రాగి, రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, చేసిన వాహన నియమ నిబంధనలను పాటించకుండా వాహనాలు నడిపిన వారిపై వాహనాలు సీజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. 31 డిసెంబర్ అర్ధరాత్రి సమయం లో నూతన సంవత్సరం వచ్చిన సంధార్బంగా ఎవ్వరూ కూడా బైక్ ర్యాలీలకు ఎలాంటి అనుమతి లేదు. పోలీసు శాఖ నుండి వెలువడిన సూచనలు సలహాలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలను తీసుకోవడము జరుగుతుంది అని తెలియజేయడము జరిగినది. పై సూచనలు పాటించి జిల్లా ప్రజలు పోలీస్ అధికారులకు పూర్తిస్థాయిలో తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. డిసెంబర్ 31 రాత్రి రోజున మద్యం మత్తులో వాహనాలపై యువకులు రాష్ డ్రైవింగ్ చేసి ప్రమాదాలకు లోనై సంతోష కరమైన రోజుని విషాద కరంగా చేసుకోవద్దు. కొత్తరకం కరోనా వ్యాధి ప్రపంచ మొత్తం హడలిస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరు మాస్క్ లు, శానిటైజర్ లు ఉపయోగించి భౌతిక దూరం పాటిస్తూ సంతోషకరంగా, సురక్షితంగా నూతన సంవత్సరాన్ని తమ తమ కుటుంబ సభ్యులతో కలసి తమ తమ ఇండ్లలోనే జరుపుకోవాలని సూచించారు. ఎప్పుడు ప్రజల శాంతిభద్రతలను కాపాడుతూ, ప్రజల మంచి కోరే మీ వికారాబాద్ జిల్లా పోలీస్ డిపార్ట్మెంట్ తరుపున మనవి.



ప్రజలకు ఏమైనా శాంతిభద్రతల సమస్య ఉంటే డైల్ 100 కి కాల్ చేయాలని జిల్లా ఎస్పి తెలిపారు.

## రాష్ట్రంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి జరుగుతోంది:ఎర్రబెల్లి

(మొదటి పేజీ తరువాయి)

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆత్మబం?దువుగా, ఇంటి పెద్దన్నగా వారు భావిస్తున్నారన్నారు. రైతాంగానికి ఉచిత విద్యుత్‌కు 10వేల కోట్ల సబ్సిడీ ఇస్తున్నదని చెప్పారు వ్యవసాయాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అపపగించాలని కేంద్రం చూస్తున్నదని కాబట్టి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచి చెడులను ఎంచుకుని ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్ హరిత, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయండి:ఇంద్రకరణ్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు.కలుషిత నీటి వల్ల మత్స్య సంపద, పక్షులు,వివిధ జీవరాసులు అంతరించిపోతున్నాయని, చిత్తడి నేలలో ఎక్కువగా మనుగడ సాగిస్తున్న జీవరాసులను కాపాడవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.ఈ సమావేశంలో పీసీసీఎఫ్ ఆర్.శోభ, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి నీతూ కుమారి ప్రసాద్, అదనపు పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) సిద్దానంద్ కుక్రేటీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్‌లందరికీ వేతనం కల్పించాలి

### వికారాబాద్ జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 30 ( ప్రజాపాలన ) : ఉప సర్పంచ్ లందరికీ వేతనం కల్పించాలని వికారాబాద్ జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు భేరీ రామచందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఉప సర్పంచ్ లకు చెక్ పవర్ కల్పించారు. వారికి ఉప సర్పంచులు అందరి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రతిరోజు ఉదయం నుంచి గ్రామ అభివృద్ధి కొరకు సాయంత్రం వరకు ఉప సర్పంచులు తమ వంతు కృషి చేస్తున్నారు. ఉప సర్పంచ్ లకు గౌరవ వేతనం కల్పించాలని కోరారు. ప్రభుత్వం చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన శిలాఫలకాల పైన ఉప సర్పంచ్ ల పేర్లు పెట్టాలని కోరారు. గ్రామ పంచాయతీలో చేసే తీర్మానం ప్రతి దానిపై ఉప సర్పంచ్ ల సంతకం తీసుకోవాలని కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశానికి ఉప సర్పంచ్ లను కూడా ఆహ్వానించాలి అని అన్నారు. గ్రామాలను సందర్శించి పనులను పరిశీలించిన సందర్భంలో ఉప సర్పంచులకు తప్పనిసరిగా సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వాలి అన్నారు. గ్రామ పంచాయతీలో మహిళా సర్పంచులు ఉన్న స్థానంలో భర్తగా నీ కొడుకులు గానీ పెత్తనం చేయకుండా అధికారులు ఆదేశించాలి అన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా ఉపసర్పంచ్ ల సమస్యలన్నిటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని



హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పెద్దింటి నర్సింలు జిల్లా కోశాధికారి అజీమ్ ముని షా గఫార్ వికారాబాద్ మండల అధ్యక్షులు గొట్టిముక్కుల మల్లేశం ఉపాధ్యక్షులు సురేష్ ముదిరాజ్ హనుమంత్ రెడ్డి రజిని బాబు సద్దాం హుస్సేన్ జిల్లా కార్యవర్గం మండల కార్యవర్గం ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు

## కోనేరు కోనప్పను అభినందించిన కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఈసందర్భంగా ఆరువేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూపొందించిన పిప్రి ఇరిగేషన్ పనులను చేపట్టాలని, గడ్డన్నవాగు ప్రాజెక్టు నిర్మాణంలో మిగిలిన పది కిలోమీటర్ల పొడవు సిసి కెనాల్‌ను సత్వరమే పూర్తిచేయాలని, నియోజక వర్గంపరిధిలోని అర్లి వంతెన కూలిపోయే దశలో ఉన్నందున పునర్నిర్మాణ పనులను చేపట్టాలని, గుండెగావ్ గ్రామం ముంపునకు గురవుతున్నందున గ్రామ ప్రజలను ఆదుకునేందుకు నిర్వాసిత సహాయ కార్యక్రమాలను చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్, స్పెషల్ సెక్రటరీ స్మితా సబర్వాల్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు... రూట్ మారనున్నాయా..?

హైదరాబాద్, డిసెంబర్ 30, :ప్పుడు లేని విధంగా ఇబ్బందికర పరిణామాలు తెలంగాణ అధికార పార్టీ టిఆర్ఎస్ ఎదుర్కొంటోంది. బలహీనంగా ఉంటూ వచ్చిన పార్టీలు కూడా ఇప్పుడు తమకు సవాలు విసిరే స్థాయికి బలం పెంచుకోవడం వెనుక తమ తప్పిదాలే ఉన్నాయనేది టిఆర్ఎస్ కాస్త ఆలస్యంగా గుర్తించింది. చాలా రోజులుగా పార్టీ ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిణామాలు పై సమీక్ష చేసుకుంటున్న కేసీఆర్ టిఆర్ఎస్ ప్రభుత్వానికి జనాల్లో ఆదరణ తగ్గడానికి గల కారణాలు ఏమిటి అనే విషయాన్ని విశ్లేషించుకుంటున్నారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నా, ప్రజల్లోకి పూర్తిగా వెళ్లడం లేదని, అలాగే ఆ పథకాలపై ప్రజల్లో సానుకూలత లేకపోవడం వంటి కారణాలతో టీఆర్ఎస్ పార్టీకి అనుకున్నంత స్థాయిలో సానుకూలత రావడం లేదు అనే విషయాన్ని కెసిఆర్ గుర్తించారు.మొన్నటి వరకు టిఆర్ఎస్ ప్రభుత్వానికి ఏ ఇబ్బంది లేకుండా ఉంటుందని, సంక్షేమ పథకాలే గట్టెక్కిస్థాయిని, ఏ ఎన్నికలు జరిగినా తెలంగాణలో తమదే విజయం అని భావిస్తూ కేసీఆర్ వచ్చారు. అందుకే ఆయన ఢిల్లీ రాజకీయాలపైన ఎక్కువగా దృష్టిపెట్టారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం టిఆర్ఎస్ అంత స్థాయిలో ప్రజల్లో సానుకూలతను పొందలేకపోయింది అనే విషయాన్ని టిఆర్ఎస్ పెద్దలు తీరిగ్గా గుర్తించారు. దానికి నిదర్శనంగానే దుబ్బాక, గ్రేటర్ ఫలితాలు వెలువడ్డాయి అని అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన కల్యాణలక్ష్మి, రైతుబంధు,ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్లు, పెన్షన్లు ఇలా పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, తాము ఊహించిన స్థాయిలో జనాల్లో ఆదరణ లేకపోవడం టిఆర్ఎస్ కు ఆందోళన కలిగిస్తోంది. ఈ పథకాలను నమ్ముకుని ముందుకు వెళ్తే, రాబోయే రోజుల్లో ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో కెసిఆర్ ఉన్నారు.

# పసితనం నుంచే సేవాభావం అలవర్చాలి..

### చిన్నారులకు వారి తల్లిదండ్రులే ఆదర్శం.. పెద్దలు ఆదర్శంతంగా ఉండాలి : సుదర్శన్ రెడ్డి







అమీర్ పేట్(ప్రజాపాలన) : పిల్లలకు పసితనం నుంచే సేవాభావం అలవర్చాలని ప్రముఖ వ్యాపారవేత్త సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆయన కుమారుడు పుట్టిన రోజు సందర్భంగా దేవనార్ అంధుల పాఠశాలలో వేడుకలను బుధవారం నిర్వహించారు. కుమారుడితో కేకును కట్ చేయించి దానిని పాఠశాలలోని అంధ విద్యార్థులకు పంచిపెట్టారు. అదే విధంగా కుటుంబ సభ్యులతో కలిసి విద్యార్థులతో భోజనం చేశారు. రుచికరమైన ఆహారాన్ని వారికి అందించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు ఊహ తెలిసినప్పటి నుంచి చక్కటి నడవడికను నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. అందుకే తల్లిదండ్రులు పిల్లల విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. అయితే తల్లిదండ్రులు చెప్పే మంచి కేవలం చేతలకు పరిమితం కావొద్దన్నారు. దాని వలన పిల్లలపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. పిల్లలు తల్లిదండ్రులను చూసి నేర్చుకుంటారని, వారినే తమ ఆదర్శంగా భావిస్తారని పేర్కొన్నారు. కాబట్టి పిల్లలను నేర్పించాలనుకునే వాటిని ఆచరణలో చూపించాలన్నారు. తద్వారా పెద్దలను చూసి వారు వాటిని అలవరచుకుంటారని వివరించారు. అందుకే తాను, తన కుటుంబ సభ్యులు పిల్లల విషయంలో ఆదర్శంగా ఉండేందుకు పూర్తిగా ప్రయత్నిస్తామన్నారు. అందుకే తన కుమారుడిని కూడా సేవా కార్యక్రమాల్లో భాగస్వామిని చేస్తానన్నారు. తద్వారా సామాజిక బాధ్యత, సేవా తత్పరత అలవడుతుందని అభిప్రాయపడ్డారు. పాఠశాలకు ఎటువంటి సహాయం అవసరం ఉన్నా తాను సహాయం చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేంద్రానికి లేఖ రాసిన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

దీంతో పాటు తాజాగా హైదరాబాద్ నగరంలో మునుపెన్నడూ లేని విధంగా వచ్చిన వరదల పైన అధ్యయనం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, వరదలకు ప్రధాన కారణమైన ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని నాలాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా స్ట్రాటజిక్ నాలా డెవలప్మెంట్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని తీసుకుందని, హైదరాబాద్ నగర పరిధిలోని నాలాలను మరియు వాటర్ డ్రైన్ లను అభివృద్ధి చేసేందుకు ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ పనులు చేపడుతున్నట్లు తెలిపింది. ఈ కార్యక్రమానికి 1200 కోట్ల వార్షిక యాక్షన్ ప్లాన్ ని సిద్ధం చేసిందని ఇందులో కనీసం 20 శాతం అంటే 240 కోట్ల రూపాయలను కేంద్ర బడ్జెట్లో ప్రత్యేకంగా కేటాయించాలని మంత్రి కేటీఆర్, కేంద్ర మంత్రులను కోరారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత అతి పెద్ద పట్టణం అయిన వరంగల్ నగరంలో ప్రస్తుత మరియు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు నియో మెట్రో రైల్ ని ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇప్పటికే నియో మెట్రో కి సంబంధించిన ప్రమాణాలను, ప్రత్యేకతలను కేంద్ర ప్రభుత్వం తుది రూపు ఇచ్చిన నేపథ్యంలో, వరంగల్ నగరానికి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.ప్రస్తుతం వరంగల్ జనాభా దాదాపు 15 లక్షల వరకు ఉంటుందని, 2051 నాటికి 35 లక్షల వరకు వరంగల్ జనాభా పెరిగే అవకాశం ఉందని, ఇంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ పట్టణంలో మహారాష్ట్రలోని నాసిక్ తరహాలో నియో మెట్రో ప్రాజెక్ట్ ని చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నాసిక్ మెట్రో కి డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసిన మహారాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ వారి సహకారంతో వరంగల్ నియో మెట్రో కి సంబంధించిన డి పి ఆర్ సిద్ధం అయిందన్నారు. సుమారు 15.5 కిలోమీటర్ల ఉండే వరంగల్ మెట్రో కారిడార్ కి 1,050 కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని, ఇందులో లో 20 శాతం నిధులు అంటే 210 కోట్ల రూపాయలను ఈక్విటీ లేదా గ్రాంట్ రూపంలో కేంద్ర ప్రభుత్వం రానున్న బడ్జెట్లో కేటాయించాలని మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పురపాలక శాఖ తరఫున రాష్ట్రంలోని పురపాలికల్లో అనేక కార్యక్రమాలు చేపట్టామని మంత్రి ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాలు అన్నీ కూడా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వివిధ కార్యక్రమాల మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని పురపాలికల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కోసం సుమారు 258 కోట్ల రూపాయలతో చేపట్టిన కార్యక్రమానికి సంబంధించి టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు.వివిధ పురపాలికల్లో పేరుకుపోయిన 70 లక్షల మెట్రిక్ టన్నుల లెగసి డంపును (ఇప్పటి వరకు ఉన్న చెత్త) 520 కోట్ల రూపాయల ఖర్చుతో బయో మైనింగ్ మరియు రేమేడియేశన్ చేస్తున్నట్లు తెలిపారు. మానవ వ్యర్థాల ట్రీట్మెంట్ ప్లాంట్ లకు సంబంధించి ఇప్పటికే 76 పురపాలికల్లో పనులు పూర్తయ్యాయని, ఇందుకోసం సుమారు 250 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలోని 57 పురపాలికల్లో సుమారు 13,228 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు వేస్ట్ వాటర్ ట్రీట్మెంట్ ప్రాజెక్టు కు నిధులు అవసరం అవుతాయని, అయితే అందులో మొదటి దశ కింద 30 పట్టణాల్లో 2828 కోట్ల రూపాయలతో పనులు చేపట్టాలని యోచిస్తున్నామని తెలిపారు.

# ఆర్గానిక్ పేరుతో కాలుష్యం

హైదరాబాద్, డిసెంబర్ 30, :రాష్ట్రంలో ఆర్గానిక్ విధానంలో పంటసాగు తక్కువేనని కేంద్ర వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. కష్టమర్ల నుంచి పెరుగుతున్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని కొందరు కెమికల్స్ తో పండించిన వాటిని కూడా ఆర్గానిక్ పేరుతో మార్కెట్ చేసుకుంటున్నారని వెల్లడించింది. ఆర్గానిక్ పంటలు సాగవుతున్న భూవిస్తీర్ణం చాలా తక్కువని తెలిపింది. ఏ రాష్ట్రంలో ఎంత ఆర్గానిక్ సాగు ఉందనే దానిపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం డేటాను రిలీజ్ చేసింది. దీని ప్రకారం తెలంగాణలో ఈ ఏడాది మార్చి నాటికి కేవలం 69,189 ఎకరాల్లోనే ఆర్గానిక్ ఫార్మింగ్ జరుగుతోంది. రాష్ట్రంలోని మొత్తం సాగుభూమిలో ఇది 0.6 శాతం మాత్రమే! ఆర్గానిక్ సాగులో రాష్ట్రం17వ స్థానంలో ఉంది. తెలంగాణకు స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ ఉన్నప్పటికీ రైతులకు ఆ దిశగా ప్రోత్సాహం అందడం లేదు. ఆర్గానిక్ పంట ఉత్పత్తులకు మార్కెట్లో ఇప్పుడు మస్త్ డిమాండ్ ఉంది. ఆర్గానిక్ కూరగాయలు, పండ్లు, పప్పుల ధరలు ఎక్కువైనా కొంటున్నారు. ఆర్గానిక్ఫుడ్స్ పేరుతో ప్రత్యేకంగా హోటళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నరు. ఆర్గానిక్ పేరుతో ఇప్పుడు మార్కెట్ చేస్తున్న సరుకులను పండించడానికి దాదాపు ఆరు నుంచి ఏడు లక్షల ఎకరాల్లో ఆర్గానిక్ వ్యవసాయం చేయాలి. ప్రస్తుతం మధ్యప్రదేశ్, గుజరాత్, తెలంగాణ, సిక్కిం, బీహార్, కర్నాటక, ఒడిశా, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఛత్తీస్గఢ్, తమిళనాడు, యూపీల్లో మాత్రమే వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ (అపెడా) గుర్తింపు పొందిన ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఏజెన్సీలు ఉన్నాయి. ఇలాంటి సర్టిఫికేషన్ఉన్న ప్రొడక్టులను మాత్రమే కొనాలి.కేంద్రం రిపోర్ట్ ప్రకారం ఈ ఏడాది మార్చి నాటికి దేశవ్యాప్తంగా 68.69 లక్షల ఎకరాల్లో ఆర్గానిక్ సాగు జరుగుతోంది. ప్రస్తుతం దేశంలోని 34.61 కోట్ల ఎకరాల సాగుభూమిలో ఇది రెండు శాతం మాత్రమే! ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో కొన్ని రాష్ట్రాలు ముందున్నాయి. అత్యధికంగా 18.78 లక్షల ఎకరాల సాగుతో మధ్యప్రదేశ్ ఫస్ట్ ప్లేసులో ఉంది. దేశంలో మొత్తం ఆర్గానిక్ సాగులో ఇది 27 శాతం. తరువాతి స్థానాల్లో రాజస్థాన్, మహారాష్ట్ర ఉన్నాయి. టాప్?10 రాష్ట్రాలే 80 శాతం సాగును నమోదు చేస్తున్నాయి. దేశంలోనే పూర్తిగా 100 % ఆర్గానిక్ పద్ధతిలో పంటలు పండిస్తున్న రాష్ట్రంగా సిక్కిం రికార్డులకు ఎక్కింది. మేఘాలయ, మిజోరం, ఉత్తరాఖండ్, గోవా ప్రాంతాల్లో మొత్తం సాగు పంటలలో సేంద్రీయం 10 %, అంతకంటే ఎక్కువే ఉంది. ఆంధ్రప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కేరళ, ఉత్తరాఖండ్, మిజోరం, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు రైతులు పూర్తిగా సహజ వ్యవసాయ విధానాలను పాటించేలా ఎంకరేజ్ చేస్తున్నాయి. అయితే అందుకు తగిన వనరులను సిద్ధం చేసుకోవడం లేదని కేంద్రం పేర్కొంది.

## జనవరి 17న రజనీ ప్రకటన

చెన్నై, డిసెంబర్ 30, :తమిళనాట మరో కొత్త పార్టీ ఆవిర్భవించనుందని కొద్దిసేపటి వరకూ అనుకున్నాం. నిజానికి ఈనెల 31వతేదీన రజనీకాంత్ తన కొత్త పార్టీని ప్రకటించాల్సి ఉంది. ఆయన డిసెంబరు 31వ తేదీన పార్టీని ప్రకటిస్తానని పేర్కొన్న సంగతి తెలిసిందే. దీంతో తమిళనాడు రాజకీయ పార్టీలు రజనీకాంత్ కొత్త పార్టీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. డిసెంబరు 31వ తేదీన రజనీకాంత్ పార్టీని ప్రకటిస్తారా? లేక పార్టీ ప్రకటన తేదీని వెలువరిస్తారా? అన్నదానిపై రజనీకాంత్ క్లారిటీ ఇచ్చేశారు. తాను పార్టీ ని ఇప్పట్లో ప్రకటించేది లేదని రజనీకాంత్ తెలిపారు. తమిళనాడులో మరో ఐదారు నెలలో ఎన్నికలు జరగనున్నాయి. రజనీకాంత్ కొత్త పార్టీ ప్రకటన రావాల్సి ఉంది. ఇప్పటికే రజనీకాంత్ తన పార్టీ పేరును కేంద్ర ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ చేసినట్లు తెలుస్తోంది. కొత్త పార్టీ పేరును, గుర్తును కూడా రజనీకాంత్ స్వయంగా ప్రకటించాల్సి ఉండటంతో వాటిని గోప్యంగా ఉంచారు. అయితే కొత్త పార్టీ పేరు మక్కల్ సేవై కట్చి గా సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. రజనీకాంత్ పార్టీ గుర్తు ఆటోగా కూడా వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. అయితే చివరి నిమిషంలో ఆయన ఆలోచనను విరమించుకున్నారు.అయితే రజనీకాంత్ జనవరి నెలలో పార్టీ పేరును, గుర్తును ప్రకటిస్తారని మక్కల్ మంద్రం నేతలు చెప్పుకొచ్చారు. జనవరి 17వ తేదీన ఆయన పార్టీ పేరును ప్రకటించే అవకాశముందని కూడా వార్తలు వచ్చాయి. త్రై మాసం కావడంతో శుభసూచికమని అంటున్నారు. జనవరి 17వ తేదీ ఎంజీఆర్ పుట్టిన రోజు కావడంతో అదే రోజు రజనీకాంత్ పార్టీ పేరును, గుర్తును ప్రజలకు పరిచయం చేసే అవకాశముందన్న వార్తలు వస్తున్నాయి. అదే రోజు నుంచి తమిళనాడు మొత్తం వారం రోజుల పాటు పార్టీ ఆవిర్భోత్సవ వారోత్సవాలు కూడా నిర్వహించాలని నిర్ణయించారు.రజనీకాంత్ పార్టీ ప్రకటన కోసం అనేక మంది ఎదురు చూస్తున్నారు.కానీ రజనీకాంత్ ఆకస్మిక ప్రకటన అభిమానులను నిరుత్సాహ పర్చింది. తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఇప్పట్లో పార్టీని ప్రకటించలేనని రజనీకాంత్ స్పష్టం చేశారు. దీంతో ఇక తమిళనాడులో రజనీకాంత్ పార్టీ వచ్చే అవకాశాలు లేనట్లే కనపడుతున్నాయి. కుటుంబ సభ్యుల వత్తిడి మేరకే రజనీకాంత్ పార్టీ ప్రకటనను విరమించుకున్నారు.కమల్ లో కనిపిస్తున్న ఉత్సాహం తమిళనాడు ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. ఇప్పటికే అన్ని పార్టీలూ ప్రచారాన్ని ప్రారంభించాయి. ఈ నెల 31వ తేదీన రజనీకాంత్ కొత్త పార్టీని ప్రకటించబోతున్నారు. అయితే రజనీ కొత్త పార్టీ బీజేపీ ప్రోద్భలంతోనే వస్తుందన్న ప్రచారం ఇప్పటికే తమిళనాట అంతటా జరుగుతుంది. ప్రధానంగా డీఎంకే ఈ ప్రచారాన్ని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా చేస్తుంది. తమను దెబ్బతీయడానికి డీఎంకే ఆడుతున్న ఆటలో భాగమే రజనీకాంత్ కొత్త పార్టీ అని వారు ఆరోపిస్తున్నారు. కానీ రజనీకాంత్ తన పార్టీ ఆలోచనను విరమించుకున్నారు.కమల్ హాసన్ కూడా తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మక్కల్ నీది మయ్యమ్ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే రజనీకాంత్ పార్టీతో ఆయన పొత్తు పెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని కమల్ హాసన్ చెప్పారు. రజనీకాంత్ పార్టీని ప్రకటించిన తర్వాత చర్చలు జరపాలని కమల్ హాసన్ భావిస్తున్నారు. రజనీకాంత్ ముఖ్యమంత్రి బాధ్యతలను తీసుకోనని చెప్పడంతో తాను సిద్ధమేనని కమల్ హాసన్ ప్రకటించారు. అయితే ఇప్పుడు రజనీకాంత్ పార్టీ రాకపోతుండటంతో కమల్ హాసన్ తృతీయ కూటమి ఏర్పాటుకు కొంత గండిపడినట్లే అవుతుంది.అయితే రజనీకాంత్ మాత్రం కమల్ హాసన్ పార్టీతో పొత్తు పెట్టుకునేందుకు వెనకాడుతున్నట్లు ఆయన సన్నిహితులే చెబుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం రజనీకాంత్ కొంత బీజేపీ అనుకూలంగా ఉండటమే కారణం. కమల్ హాసన్ మాత్రం బీజేపీ మీద ఒంటికాలితో లేస్తున్నారు. దీంతో కమల్ హాసన్ తో పొత్తునకు రజనీకాంత్ అంగీకరించే అవకాశాలు కన్పించడం లేదు. డీఎండీకే, పీఎంకేలతో కలసి రజనీకాంత్ ఎన్నికలకు వెళతారన్న చర్చ జరుగుతుంది. అయితే ఈ ప్రచారానికి రజనీకాంత్ తెరదించేశారు.ఇప్పటికే తమిళనాడులో రెండు కూటములు బలంగా ఉన్నాయి. అన్నాడీఎంకే, డీఎంకే కూటములు సీట్ల సర్దుబాటుకు కూడా సిద్ధమవుతున్నాయి. అయితే రజనీకాంత్ పార్టీ వచ్చిన తర్వాత ఈ కూటముల్లోని కొన్ని పార్టీలు రజనీకాంత్ చెంతకు చేరేందుకు రెడీ అయిపోయాయి. అందుకే కొన్ని పార్టీలు ఇంకా సీట్ల సర్దుబాటు చేసుకోలేదు. ఇప్పుడు రజనీకాంత్ పార్టీ రాకపోతుండటంతో డీఎంకే, అన్నాడీఎంకే కూటముల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. రజనీకాంత్ రాజకీయాల్లోకి రావడానికి వెనకడగు వేయగా, కమల్ హాసన్ మాత్రం వేగంగా దూసుకుపోతున్నారు.

## ఫాస్టాగ్ ఎక్కడ కొనాలి? ఎలా రీఛార్జ్ చేయాలి?




వచ్చే జనవరి 1 నుంచి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వాహనాలకు ఫాస్టాగ్‌ను కేంద్రం తప్పనిసరి చేసింది. ఈ ఫాస్టాగ్‌తో హైవేలపై టోల్ ప్లాజాల దగ్గర టైమ్ వృథా అయ్యే అవకాశం ఉండదు. రానున్న రోజుల్లో ఫాస్టాగ్ లేకపోతే హైవే ఎక్కే పరిస్థితి కూడా ఉండకపోవచ్చు. ఈ నేపథ్యంలో అసలు ఈ ఫాస్టాగ్ ఎక్కడ కొనాలి? ఎలా రీఛార్జ్ చేయాలో ఒకసారి చూద్దాం.

ఫాస్టాగ్ ఎలా కొనాలి?

దీనికోసం చాలా ఆప్షన్లే ఉన్నాయి. మీ కారు కోసం ఫాస్టాగ్ కొనాలంటే నేరుగా టోల్ ప్లాజాల దగ్గరే వెళ్లవచ్చు. దీనికోసం మీ ఐడీ, వెహికిల్ రిజిస్ట్రేషన్ పత్రాలను కచ్చితంగా తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. కేవైసీ ప్రక్రియ కోసం ఇవి తప్పనిసరి. ఇంకా సులువుగా కొనాలనుకుంటే.. అమెజాన్ వెబ్‌సైట్‌కు లేదా ఈ ఫాస్టాగ్ అందించే బ్యాంక్ వెబ్‌సైట్లకు వెళ్లవచ్చు. ప్రస్తుతానికి ఫాస్టాగ్‌ను హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఎస్‌బీఐ, కోటక్, యాక్సిస్ బ్యాంకులు అందిస్తున్నాయి. ఇవే కాకుండా మీ ఫోన్‌లోని పేటీఎం, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ యాప్స్ ద్వారా కూడా వీటిని కొనుగోలు చేయవచ్చు.

ఫాస్టాగ్‌కు ఎంత ఖర్చువుతుంది?

ఫాస్టాగ్‌కు ఎంత ఖర్చువుతుందన్నది రెండు అంశాలపై ఆధారపడి ఉంటుంది. మొదటిది మీరు ఏ వాహనం కోసం తీసుకుంటున్నారు అంటే కార్, జీప్, వ్యాన్, బస్, ట్రక్, వాణిజ్య వాహనాలు వంటివి. రెండోది.. ఏ బ్యాంక్ నుంచి ఈ ఫాస్టాగ్‌ను తీసుకుంటారన్నదానిపై కూడా ధర ఆధారపడి ఉంటుంది. ఒకవేళ మీ కారుకు పేటీఎం నుంచి ఫాస్టాగ్ తీసుకోవాలని అనుకుంటే.. రూ.500 నుంచి కొనుగోలు చేయవచ్చు. ఇందులోనే రీఫండబుల్ సెక్యూరిటీ అమౌంట్ రూ.250, కనీస బ్యాలెన్స్ రూ.150 కూడా ఉంటుంది. ఇక ఇదే ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి అయితే.. ట్యాగ్ జారీ చేయడానికి రూ.99.12, రూ.200 సెక్యూరిటీ డిపాజిట్, రూ.200 కనీస బ్యాలెన్స్ అవసరమవుతుంది. ఫాస్టాగ్‌లపై పలు బ్యాంక్‌లు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు కూడా ఇస్తున్నాయి.


రీఛార్జ్ ఎలా?

ఫాస్టాగ్ రీఛార్జ్ కూడా చాలా ఈజీ. మీరు ఏ బ్యాంక్ నుంచి కొన్నారో.. దాని ఫాస్టాగ్ వాలెట్‌లోకి వెళ్లి ఇంటర్నెట్ బ్యాంకింగ్ లేదా డెబిట్, క్రెడిట్ కార్డ్, లేదా యూపీఐ ద్వారా రీఛార్జ్ చేసుకోవచ్చు. ఇంకా ఈజీగా రీఛార్జ్ చేసుకోవాలంటే పేటీఎం, ఫోన్‌పె, అమెజాన్ పే, గూగుల్ పేలాంటివి వాడొచ్చు. ఇవి ఏ బ్యాంక్ ఫాస్టాగ్‌కైనా రీఛార్జ్ ఆప్షన్ ఇస్తున్నాయి.

## 19 జలవనరుల ప్రాదేశిక ప్రాంతాలు

హైదరాబాద్, డిసెంబర్ 30, :జల వనరుల శాఖలో మార్పులు చేశారు సీఎం కేసీఆర్. రాష్ట్రం మొత్తాన్ని 19 జల వనరుల ప్రాదేశిక ప్రాంతాలుగా గుర్తించి, ఒక్కొక్క దానికి ఒక్కో సీఈని పర్యవేక్షణాధికారిగా బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. ఆరుగురు ఈఎన్సీలను నియమించి వారికి కూడా బాధ్యతలు పంచాలని నిర్ణయించారు. జనరల్, అడ్మినిస్ట్రేషన్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగాలకు ప్రత్యేకంగా ఈఎన్సీలు ఉంటారు. ప్రాదేశిక సీఈల స్థానంలో కూడా ముగ్గురు సీనియర్ అధికారులకు ఈఎన్సీ క్యాడర్ లో బాధ్యతలు అప్పగించారు. జలవనరుల శాఖ పునర్వ్యవస్థీకరణతో మొత్తం 945 అదనపు పోస్టులు అవసరమవుతాయని అంచనా వేశారు అధికారులు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాజెక్టులపై ఆ జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్షించి నిర్వహించిన కేసీఆర్? చనాక–కొరాట ప్రాజెక్టు బ్యారేజీ, పంప్ హౌస్, కాలువలను 2021 జూన్ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. చెన్నూరు లిఫ్ట ఇరిగేషన్ స్కీంతో పాటు పెండింగ్ లో ఉన్న మధ్యతరహా ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. ఆసిఫాబాద్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల పరిధిలో ఆయకట్టును అభివృద్ధి చేయడానికి ప్రాణహిత ప్రాజెక్టుపై అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లాలో కుప్తి ప్రాజెక్టు, మహబూబ్ నగర్ జిల్లాలో గట్టు ప్రాజెక్టు, జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని నాగమడుగు ఎత్తిపోతల పథకం టెండర్లను వెంటనే పిలిచి, పనులు చేపట్టాలని కేసీఆర్ అధికారులను ఆదేశించారు. వరంగల్ జిల్లాలో గోదావరి కరకట్టల పనులను వచ్చే వానాకాలంలోపు పూర్తి చేయాలన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని కోనారెడ్డి చెరువుకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పరకాల నియోజకవర్గంలోని కోనాయమాకుల ఎత్తిపోతల పథకంలో మిగిలిపోయిన పనులను తక్షణం పూర్తి చేయాలని చెప్పారు. అచ్చంపేట ఎత్తిపోతల పథకం కోసం సర్వే నిర్వహించాలని ఆదేశించారు. కొత్తగా హుజూర్ నగర్ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.రాష్ట్రంలో సాగునీళ్లు అందించే ప్రాంతాలను 19 సర్కిళు ్లగా గుర్తించి.. ఒక్కో సర్కిల్ పర్యవేక్షణ బాధ్యతను ఒక్కో సీఈకి అప్పగించాలని సీఎం ఆదేశించారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్, రామగుండం, వరంగల్, ములుగు, సంగారెడ్డి, గజ్వేల్, నల్గొండ, సూర్యాపేట, వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, హైదరాబాద్, కొత్తగూడెం, ఖమ్మం సర్కిళ్లుగా డిపార్ట్‌మెంట్ ను పునర్ వ్యవస్థీకరించారు. డిపార్ట్ మెంట్‌లో జనరల్, అడ్మిన్, కరీంనగర్ ఈఎన్సీ పోస్టులు ఉండగా.. వాటికి అదనంగా కాళేశ్వరం ఈఎన్సీ పోస్టులు రెండు, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్‌కు కొత్తగా మరో ఈఎన్సీ పోస్టులను మంజూరు చేయనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇద్దరు ఈఎన్సీలు ఉన్నారు. కరీంనగర్ ఈఎన్సీని అదే స్థానంలో కొనసాగించనున్నారు. జనరల్ ఈఎన్సీగా మురళీధర్, అడ్మిన్ ఈఎన్సీగా నాగేందర్‌రావు కొనసాగుతారు. అడ్మిన్ ఈఎన్సీ వద్ద ఉన్న ప్రాజెక్టుల బాధ్యతలను మరో సీఈకి అప్పగిస్తారు. అడ్మిన్ ఈఎన్సీ ఆధీనంలో ఉన్న కమిషనర్ ఆఫ్ టెండర్స్ బాధ్యతలను జనరల్ ఈఎన్సీకి అప్పగించారు.నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల లింకులు, పెండింగ్ ప్రాజెక్టులను టైం పెట్టుకుని పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చనాకా?కొరాట బ్యారేజీ, పంపుహౌస్, కాల్వలను వచ్చే ఏడాది జూన్‌లోగా పూర్తి చేయాలన్నారు. చెన్నూరు లిఫ్టులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను ఇంజనీర్లతో కలిసి సందర్శించాలని వాటర్ రీసోర్సెస్ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్ ను ఆదేశించారు. ప్రాణహిత ప్రాజెక్టు పనులకు సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు.ఆదిలాబాద్ జిల్లాలోని కుంప్టి, మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, జుక్కల్ నియోజకవర్గంలోని నాగమడుగు లిఫ్ట్ స్కీం టెండర్లను వెంటనే పిలవాలని సీఎం ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గోదావరి కరకట్టల నిర్మాణాలను వానాకాలంలోపు పూర్తి చేయాలన్నారు. వర్ధన్నపేటలోని కోనారెడ్డి చెరువుకు శాశ్వత ప్రాతిపదికన రిపేర్లు చేయాలని సూచించారు. పరకాలలో పెండింగ్‌లో ఉన్న కోనాయమాకుల లిఫ్ట్ స్కీం పనులు పూర్తి చేయాలన్నారు. అచ్చంపేట లిఫ్ట్ స్కీంకు వెంటనే సర్వే చేయాలని చెప్పారు. హుజూర్‌నగర్ నియోజకవర్గానికి సాగు, తాగునీటిని అందించే లిఫ్ట్ స్కీంను మంజూరు చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు.డిపార్ట్ మెంట్‌లో ఈఎన్సీ క్యాడర్ పోస్టులు ప్రస్తుతం 3 ఉండగా ఇంకో 3 పోస్టులు క్రియేట్? చేస్తున్నారు. సీఈ పోస్టులను 19 నుంచి 22కు.. ఎస్ఈలను 47 నుంచి 57కు.. ఈఈ పోస్టులు 206 నుంచి 234కు.. డీఈఈ పోస్టులు 678 నుంచి 892కు, ఏఈఈ పోస్టులు 2,436 నుంచి 2,796కు.. టెక్నికల్ ఆఫీసర్ పోస్టులను 129 నుంచి 199కి, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులను 173 నుంచి 242కు, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులను 346 నుంచి 398కి, నాన్ టెక్నికల్ పర్సనల్ అసిస్టెంట్లను 31 నుంచి 45కు, సూపరింటెండెంట్ పోస్టులను 187 నుంచి 238కి.. రికార్డు అసిస్టెంట్ల సంఖ్యను 134 నుంచి 205కు పెంచారు. రీఆర్గనైజేషన్‌తో 945 పోస్టులు అదనంగా అవసరం అవుతాయని లెక్క తేల్చారు.

## ఉన్నారో.. లేరో తెలియకుండా టీ కాంగ్రెస్ నేతలు



రంగారెడ్డి, హైదరాబాద్, 30, :ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్.. తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఉనికి కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తొలి ఐదేళ్లు హుషారుగా పనిచేసిన నాయకులు..అసెంబ్లీ ఎన్నికల తర్వాత డీలా పడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు, దీక్షలు చేస్తున్నా ఎంత మంది వీటిల్లో పాల్గొంటున్నారన్నది ప్రశ్నగా మారిందట. ఇక రంగారెడ్డి జిల్లాలో ఉన్న కొద్దిమంది నేతలు పార్టీతో సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారట. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విచిత్రంగా ఉందని అంటున్నారు. జిల్లాల విభజన తర్వాత కొత్త జిల్లాలకు నేతలు కరువయ్యారు. అనేక ఆటుపోట్లు, కష్టాల మధ్య డీసీసీ అధ్యక్షులను ఎంపిక చేశారు. నియోజకవర్గం ఇంఛార్జ్‌ల నియామకమైతే అయోమయంగా మారిపోయింది. పీసీసీ, ఏఐసీసీ పోరాటాలకు, నిరసనలకు పిలుపు ఇస్తున్నా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నేతల నుంచి పెద్దగా స్పందన లేదట. దీనిపై గాంధీభవన్ నుంచి జిల్లా నాయకులకు ఫోన్లు వచ్చినట్లు తెలుస్తోంది.ముందస్తు అసెంబ్లీ ఎన్నికల వరకూ రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీకి చెప్పుకోదగ్గ నాయకులు ఉన్నప్పటికీ పార్లమెంట్ ఎన్నికల తర్వాత సీన్ మొత్తం మారిపోయింది. ప్రతి జిల్లాలో పట్టుమని పదిమంది పేరు మోసిన నాయకులు లేరట. ఒకప్పుడు రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హవా కొనసాగింది. అధికారం కోల్పోవడం.. ఎమ్మెల్యేల జంపింగ్‌లు.. ఇప్పుడు ప్రతిపక్ష హోదా లేకపోవడంతో పూర్తిగా డీలా పడింది. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా నుంచి సబితా ఇంద్రారెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా గెలిచారు. మల్కాజ్‌గిరి ఎంపీ స్థానం కాంగ్రెస్ ఖాతాలో చేరింది. ఇప్పుడు ఆ ఎంపీ ఒక్కరే కాంగ్రెస్‌లో ఉన్నారు. ఎమ్మెల్యేలు ఎప్పుడో కారెక్కేశారు. 2018 ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు పోటీ ఇచ్చిన తాండూరు, మహేశ్వరం, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పరిస్థితి అర్థం కావడం లేదట. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, చేవెళ్ల నియోజకవర్గాల్లో నేతలు పత్తా లేరు.మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పార్టీలో ఉన్నారో లేదో తెలియడం లేదట. అలాగే మల్‌రెడ్డి రంగారెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, మాజీ మంత్రులు గడ్డం ప్రసాద్ లాంటి నాయకులు ఒకటిరెండు కార్యక్రమాల్లో కనిపిస్తున్నా తర్వాత ముఖం చాటేస్తున్నారట. బిక్షపతి యాదవ్ ఇప్పటికే బీజేపీలో చేరగా మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్ త్వరలోనే కమలం తీర్థం పుచ్చుకోనున్నారు. ఇంఛార్జ్‌లు లేకపోవడంతో ఒక్కో నాయకుడు రెండు నియోజకవర్గాల బాధ్యతలను చూసుకుంటున్నారు. మరి.. పార్టీ పెద్దలు ఈ జిల్లాలపై దృష్టి పెడతారో లేక తమకేం పట్టనట్లు వదిలేస్తారో చూడాలి.

అంబేడ్కర్ రాజనీతి ఉద్యమం
Ambedkar Rajaneethi Movement (ARM)
www.ambedkarrajaneethi.com

బహుజనుల కోసం డిమాండ్లు
1. మద్యపానాన్ని నిషేధించాలి
2. మహిళలకు అన్నింటా 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి.
3. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలి.
4. న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు కల్పించాలి.
5. వెనుకబడిన తరగతులకు చట్ట సభల్లో 50 - రిజర్వేషన్ కల్పించాలి.
6. ఎస్సీ లకు మత స్వేచ్ఛ కల్పించాలి.
7. బుద్ధుడు ప్రవచించిన సమతా భావాన్ని సమర్థించేలా చర్యలు చేపట్టాలి.
8. జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని కులాలకు రిజర్వేషన్ కల్పించాలి.
9. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.
10. రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలి.
11. అందరికి ఉచిత విద్య కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టాలి.
12. ప్రైవేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి. ఇప్పటికే ఉన్న ప్రైవేటు విద్యా సంస్థల్ని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవాలి.
13. ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం అందించాలి.
14. ప్రైవేట్ ఆస్పత్రులను రద్దు చేయాలి.
15. పరిశ్రమల్ని జాతీయం చేయాలి. ప్రైవేట్ రంగంలో నడిచే పరిశ్రమల్లో రిజర్వేషన్ కల్పించాలి.
16. ఆధార్ కార్డు ఉన్న ప్రతి పౌరుడికి 2,00,000/- రూపాయలు ఋణం ఇవ్వాలి. సక్రమ చెల్లింపుపై తరువాత సంవత్సరం రెట్టింపు ఋణం ఇవ్వాలి.
17. భూమిలేని రైతులకు ప్రభుత్వ/దేవాలయ లేదా ఇతరత్రా ఏదైనా 4 ఎకరాల భూమి ఇవ్వాలి.
18. ప్రతీ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలి.
19. వలసలను అరికట్టేందుకు ఎక్కడికి అక్కడే గ్రామీణ ప్రాంతాల్లో సరికొత్త సాంకేతిక వ్యవసాయ, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.
20. వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చి సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి.
21. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలను ముందుగానే ప్రకటించాలి.

ఇటువంటి విలువైన అంశాలు ఇంకా ఏవైనా ఉంటే దయచేసి మా దృష్టికి తీసుకురండి.

ఆహ్వానం
అంబేడ్కర్ రాజనీతి ఉద్యమంలో భాగస్వాములుగా చేరేందుకు బహుజనులందరికీ ఆహ్వానం.
జై భీం, జై ఫూలే, జై బహుజన
సెంట్రల్ వర్కింగ్ కమిటీ
అంబేడ్కర్ రాజనీతి మూవ్ మెంట్

# ప్రజాపాలన

## సంపాదకీయం

**గురువారం 31, డిసెంబరు 2020**

# కాంగ్రెస్‌కు మంచికాలం వస్తుందా?

ప్రజల అసంతృప్తి, రాజకీయ శక్తులు బలోపేతం కావడం సకాలంలో జరిగినప్పుడే బలమైన రాజకీయ, సామాజిక ఉద్యమాలను నిర్మించేందుకు అవకాశం ఉన్నది. బీజేపీయేతర పార్టీల నాయకులు అందుకు సిద్ధంగా లేరు. రాహుల్ గాంధీ అయితే పలాయనమంత్రాలు పఠిస్తున్నారు. ఎన్నికల మధ్యలో సిమ్లాలో విహారానికి, కొత్త సంవత్సరం ఇటలీకి వెళ్ళడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? దేశ రాజధాని శివార్లలో చలితో వణుకుతున్న లక్షలాది రైతులకు ఆయన తన పర్యటనలతో ఏ సంకేతాలను అందించదలుచుకున్నారు?తెలంగాణ పిసిసి అధ్యక్షుడు ఎవరో మీకు కొత్త సంవత్సరంలో తెలుస్తుంది అని ఏఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్కం ఠాగూర్ మంగళవారం నాడు చెప్పారు. కొత్త సంవత్సరంలో ఎప్పుడు? మొదటి వారంలోనా? అని అడిగినప్పుడు కొత్త సంవత్సరం అన్నాను కదా, కొత్త సంవత్సరంలో ఎప్పుడైనా కావచ్చు.. అని చెప్పి ఆయన తప్పించుకున్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ రాజకీయాలు ఎలా ఉన్నాయో మాణిక్కం ఠాగూర్ మాటలను బట్టి అర్థం అవుతుంది. సరిగ్గా పది రోజుల క్రితం ఆయనను ఇదే ప్రశ్న అడిగినప్పుడు తాము తెలంగాణలో పర్యటించి వందలాది నేతలతో మాట్లాడి పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి నివేదిక ఇచ్చామని, త్వరలో పార్టీ అధ్యక్షుడు ఎవరో ప్రకటిస్తామని చెప్పారు. అయితే సోనియా గాంధీ ఇప్పుడు నిర్ణయాలు స్వయంగా తీసుకోవడం లేదు. అనారోగ్యం వల్ల మాత్రమే కాదు, తన కుమారుడు రాహుల్ గాంధీ సలహా ఇస్తే కాని ఆమె నిర్ణయాలు తీసుకోలేని స్థితిలో ఉన్నారు. మరి రాహుల్ తమ నివేదికను చూడకుండానే ఆదివారం నాడు ఇటలీ వెళ్ళిపోయారని తెలిసి కాంగ్రెస్ నేతలు హతాశులయ్యారు. కాంగ్రెస్ 136వ సంస్థాపక దినం సందర్భంగా ఏఐసిసిలో జరిగిన కార్యక్రమానికి సైతం ఆయన హాజరు కాలేదు. కొత్త సంవత్సరాది ఆయన ఇటలీలో గడిపి నిదానంగా వస్తారని, ఆ తర్వాతే తెలంగాణ పీసీసీకి సంబంధించి ఫైలుకు కదలిక వస్తుందని పార్టీ నేతలు ఆశిస్తున్నారు. ఒక వైపు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మూడవ స్థానంలోకి దిగజారిందని దుబ్బాక, జీహెచ్ఎంసి ఎన్నికలు నిరూపిస్తున్నాయి. కాంగ్రెస్ ఓటర్లు బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితికి బాధ్యత వహించి ఆత్మ విమర్శ చేసుకోకుండా పదవుల కోసం పోటీపడడం, ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడం, ఒకర్నొకరు విమర్శించుకోవడం, కొందరు కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే బిజెపికి భజంత్రీపరులుగా వ్యవహరించడం ప్రజలు గమనించకపోలేదు. నిజానికి ఇలాంటి సంస్కృతి మూలంగానే కాంగ్రెస్ చేతుల్లోంచి తెలంగాణ జారిపోయి, తెలంగాణ రాష్ట్ర సమితి పట్టులోకి వెళ్లిపోయింది. సిఎం పదవికోసం పదిమందికిపైగా నేతలు నాడు పోటీపడడం మాత్రమే కాదు, తెలంగాణ ఉద్యమ కాలంలో అవలంబించిన ఆత్మహత్యా సదృశమైన, అవకాశ వాద రాజకీయాలవల్లే నేతలు విశ్వసనీయత కోల్పోయారు. బహుశా ఆనాడు బలమైన ప్రతిపక్షంగా మరో పార్టీ లేనందువల్లే కాంగ్రెస్ రెండో స్థానం పొందగలిగింది కాని ఇవాళ భారతీయ జనతాపార్టీ బలంగా ఆవిర్భవించే పరిస్థితి కనపడేసరికి ప్రజలకు ప్రత్యామ్నాయం కనపడుతున్నదనడంలో అతిశయోక్తి లేదు. అయిదు దశాబ్దాలుగా చూసిన ముఖాలనే కాంగ్రెస్‌లో చూసీ చూసీ ప్రజలకు విరక్తి కలిగే పరిస్థితి ఏర్పడింది. ఎన్ని సార్లు ఓటమి పాలైనా ఆత్మ విమర్శ అంటూ లేని దుస్థితిలో చిక్కుకుంది, ఈ పరిస్థితుల్లో కొత్త శక్తులను ఆహ్వానించి కాంగ్రెస్‌ను బలోపేతం చేయడం కోసం ప్రయత్నించే బదులు పదవుల కోసం ప్రాకులాడటం, వెన్నుపోట్లకు సిద్ధపడడం చూస్తుంటే కాంగ్రెస్లో చింతచచ్చినా పులుపు చావలేదన్నట్లు కనిపిస్తుంది. అయినా వారేమి చేయగలరు? పై నుంచి నాయకత్వం బలంగా అందించాల్సిన నేతలే తమ స్వంత సుఖాలకోసం ప్రాధాన్యతలను విస్మరించి పర్యటనలు చేస్తుంటే క్రింది నేతలు మారకపోవడంలో ఆశ్చర్యం లేదు. 2017లో రాహుల్ గాంధీ పార్టీ అధ్యక్షుడు అయినప్పుడు బిహార్ కాంగ్రెస్‌లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. పార్టీలో కొత్త శక్తినీ, ఉత్సాహాన్నీ రాహుల్ నింపుతారని ప్రశంసిస్తూ బిహార్ పిసిసి తీర్మానం చేసింది. ఇవాళ మూడేళ్ల తర్వాత చూస్తే అదే బిహార్ కాంగ్రెస్‌లో నిరాశా నిస్పృహలు చోటుచేసుకున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 70 సీట్లకు పోటీ చేసి 19 సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్‌లో కుమ్ములాటలు తీవ్రతరమయ్యాయి. సిఎల్‌పి నేతృత్వం కోసం జరిగిన సమావేశంలో బాహాబాహీ ఘటనలు జరిగాయి. బిహార్ కాంగ్రెస్‌ను పునర్వ్యవస్థీకరించాలంటూ కాంగ్రెస్ అధికార ప్రతినిధి హరు? ఝాతో పాటు అనేక మంది నేతలు డిమాండ్లు చేశారు. నేతలు పార్టీ టిక్కెట్లను అమ్ముకున్నారని, బిజెపి, ఆర్ఎస్ఎస్ కోసం రహస్యంగా పనిచేశారని ఆరోపణలు చేశారు. తెలంగాణ, బిహార్‌లోనే కాదు, దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ కాంగ్రెస్లో ముఠా రాజకీయాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. అసలు కాంగ్రెస్‌లో ముఠా తగాదాలు లేని రాష్ట్రమంటూ మనకు కనపడదు. ఈ తగాదాల వల్ల మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్నే పోగొట్టుకుంటే రాజస్థాన్ ప్రభుత్వం పడబోయి ఆగింది. ఈ పరిస్థితుల్లో బిహార్, తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు ఆశ్చర్యకరమైనవి కావు. బిహార్‌లో దాదాపు వందేళ్ల క్రితం సదాఖత్ భవన్ పేరుతో కట్టిన భవనంలో కాంగ్రెస్ కార్యాలయం ఉన్నది. ఆ భవనం నుంచే గాంధీజీ, కృపలానీ వంటి వారు ఎన్నో ఉద్యమాలు నిర్వహించారు. బాబూ రాజేంద్ర ప్రసాద్ బిహార్ పార్టీ అధ్యక్షుడుగా ఆ భవనం నుంచే బాధ్యతలు నిర్వర్తించడమే కాకుండా రాష్ట్రపతి పదవీ విరమణ అనంతరం తన చరమ దశను అక్కడే గడిపారు. ఈ చరిత్రాత్మక భవనం ఇప్పుడు కాంగ్రెస్ చరమ దశకు నిదర్శనంగా నిలిచింది. పార్టీలో పనిచేసే సిబ్బందికి కూడా జీతాలు చెల్లించలేని దుస్థితిలో బిహార్ కాంగ్రెస్ కొట్టుమిట్టాడుతున్నా, ముఠా తగాదాలకు మాత్రం కొదవ లేదు. తెలంగాణలో కూడా కాంగ్రెస్ వెంటనే మేల్కొని సంఘటిత శక్తిగా నిలవకపోతే అనేక కీలక పరిణామాలకు సాక్షిగా నిలిచిన గాంధీ భవన్ కూడా చరిత్రలో తెరమరుగయ్యే అవకాశాలు లేకపోలేదు.కాంగ్రెస్ పరిస్థితి ఇలా ఉంటే దేశంలో జరుగుతున్న పరిణామాలకు తగ్గట్లుగా బిజెపియేతర పార్టీలు సన్నద్ధం కావడంలో అలసత్వం వహిస్తున్నాయి. తత్ఫలితంగానే కేంద్రంలో నరేంద్రమోదీ సారథ్యంలో బిజెపి ప్రభుత్వం తిరుగులేని శక్తిగా మారింది. ఇందులో సందేహం లేదు. మోదీ నాయకత్వం పట్ల విశ్వాసం వ్యక్తం చేసేవారు ఎంతమంది ఉన్నారో, అసంతృప్తిగా ఉన్న వారు కూడా అంతేమంది ఉండి ఉంటారు. అయితే తమపై విశ్వాసం ఉన్న వారిని కూడగట్టుకోవడంలో మోదీ విజయవంతమైనట్లుగా, అసంతృప్తిగా ఉన్న వారిని సంఘటితం చేసి వారికి విశ్వాసం కలిగించడంలో ప్రతిపక్షాలు విఫలమవుతున్నాయి. ప్రజల అసంతృప్తి, రాజకీయ శక్తులు బలోపేతం కావడం సకాలంలో జరిగినప్పుడే బలమైన రాజకీయ, సామాజిక ఉద్యమాలను నిర్మించేందుకు అవకాశం ఉన్నది. కాని దేశంలో నాయకులు అందుకు సిద్ధంగా లేరు. రాహుల్ గాంధీ లాంటి వారు పలాయనమంత్రాలు పఠించడం, ఎన్నికల మధ్యలో సిమ్లా వంటి విహార ప్రాంతాలకు, ఆ తర్వాత కొత్త సంవత్సరం గడిపేందుకు అమ్మమ్మ గారి దేశానికి వెళ్ళడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? తనకు రాజకీయాల పట్ల పెద్ద పట్టింపు లేనట్లు ఆయన కనిపిస్తున్నారు. దేశ రాజధాని సరిహద్దుల్లో లక్షలాది రైతులు చలితో వణుకుతున్న వేళ ఆయన తన పర్యటనలతో ఏ సంకేతాలను అందించదలుచుకున్నారు? అలాంటప్పుడు పార్టీలో నూటికి 99 శాతం మంది రాహుల్ గాంధీనే కోరుకుంటున్నారని ఆయన నియమించిన పార్టీ అధికార ప్రతినిధి సూర్జేవాలా ప్రకటించడంలో ఔచిత్యమున్నదా? బిజెపియేతర పార్టీల్లో ఒక డోలాయమాన స్థితి కనిపిస్తోంది. నాయకుడన్న వాడు ఎటువంటి క్లిష్టపరిస్థితుల్లోనైనా సంయమనం కోల్పోకుండా, మాట తప్పకుండా ప్రజలకు దిశా నిర్దేశం చేయగలిగి ఉండాలి. వారిని ఏకం చేయగలగాలి. ఉత్తరప్రదేశ్, బిహార్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయోద్యమాలు, అస్తిత్వ ఉద్యమాలు ఎంత బలోపేతంగా జరిగాయంటే ఇవాళ కూడా ఎన్ని కడగండ్లకు గురైనా అవి ఎంతో కొంత స్థాయిలో నిలదొక్కుకోగలుగుతున్నాయి. తమిళనాడులో పెరియార్ వి. రామస్వామి, అన్నాదురై, ఉత్తరప్రదేశ్‌లో ములాయంసింగ్, బిహార్‌లో లాలూప్రసాద్ యాదవ్ లాంటి నేతలు నాటిన బీజాలను ఇప్పటికీ పెరికివేయలేక పోతున్నారు. కాని అందరు నాయకులను అదే విధంగా ఊహించుకోలేం. 'ఏం చేస్తాం, మోదీతో మేమెక్కడ పెట్టుకుంటం? ఆయనను తట్టుకొని మేం బతగ్గలమా, మాకు పైసలు గావాలి. ఆయన మా జోలికి రాకుండా జూసుకోవాలి.' అని ఒక ప్రాంతీయ పార్టీకి చెందిన మాజీ ఎంపి ఒకరు వ్యాఖ్యానించారు. అంత మాత్రాన అందరూ మోదీకి భయపడి తమ రాజకీయాలు మార్చుకుంటారని కూడా చెప్పలేం. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తాడో పేడో తేల్చుకుని ఢీకొనేందుకు సిద్ధపడుతున్నారు. తమిళనాడులో డిఎంకె అధినేత స్టాలిన్ ఒక విస్పష్టమైన వైఖరితో మోదీ వ్యతిరేక ఫ్రంట్‌తో కలిసి పనిచేస్తున్నారు. మహారాష్ట్రలో బిజెపి ఆధిపత్యాన్ని ధిక్కరించి శివసేను.. ఎన్‌సిపి, కాంగ్రెస్‌తో చేతులు కలిపేందుకు సిద్ధపడింది. కేంద్రంలో భాగస్వామ్య పార్టీ అయిన అకాలీదళ్ పదవులను వదులుకుని రైతుల ఉద్యమానికి అండగా నిలిచింది. ఆఖరుకు రాజస్థాన్‌లో అత్యంత చిన్న పార్టీ అయిన రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీ ఎన్డీఏ నుంచి తప్పుకుంది. వ్యవసాయ బిల్లులను పార్లమెంటులో వ్యతిరేకించిన బిజూజనతాదళ్ రైతులకు కనీస మద్దతు ధర విషయంలో స్థిరమైన వైఖరికి కట్టుబడి ఉంటామని తాజాగా ప్రకటించింది. అదే సమయంలో భారత్ బంద్ లాంటి వాటికి దూరంగా ఉంటూ తన స్వతంత్ర వైఖరిని ప్రదర్శించింది. విచిత్రమేమంటే ఒకప్పుడు కేంద్రంలో మంత్రి పదవులను త్యాగం చేశామని చెప్పుకుంటున్న వారిని, స్వయంగా సొంత రాష్ట్రంలో అధికారం అనుభవించడం ప్రారంభించాక ఏ భయం వెంటాడుతోంది? కొత్త సంవత్సరంలోనైనా దేశంలో ఆరోగ్యకరమైన రాజకీయాలు వస్తాయని ఆశిద్దాం.

# పెరుగుతున్న బాలకార్మికులు




కోవిడ్ తెచ్చిన తంటా అంతా ఇంతా కాదు. పెద్దలకు పనుల్లేకుండా చేసింది. పిల్లలకు చదువును దూరం చేసింది. ఒకప్పుడు మన ప్రాంతంలో అక్కడక్కడా మాత్రమే బాల కార్మికులు కనిపించేవారు. కాని ఇప్పుడు చాలా చోట్ల కనిపిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ నోయిడా ప్రాంతంలో ఉన్న ఓ దాబాలో పదహారేళ్ల కుర్రాడు చాలా చురుకుగా పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితమే బాల కార్మికుడిగా గుర్తించి ఆ పని నుంచి పోలీసు వారు అతనిని విడిపించారు కూడా. అయితే ఒకవారం రోజుల తరువాత అతడు మళ్లీ ఆ పనిలో చేరాడు. ఎందుకు మళ్లీ ఇక్కడకు వచ్చావని ప్రశ్నిస్తే... 'లాక్‌డౌన్‌లో మా కుటుంబం చాలా ఇబ్బందులు పడింది. ఏదైనా పని దొరుకుతుందేమోనని ఆగస్టులోనే జార?ండ్ నుంచి నేను, అమ్మ ఇక్కడకు వచ్చాం. సెక్టార్-7లో ఓ కంపెనీలో అమ్మ మిషను కుట్టే పనికి కుదిరింది. ఇటీవలె అమ్మకు పని పోయింది. నాకు మాత్రమే పని ఉంది. ఈ పరిస్థితుల్లో పనిచేయడం తప్పనిసరి. ఎలాగో స్కూళ్లు ఆన్‌లైన్ ద్వారానే నడుస్తున్నాయి కదా. ఎక్కడ నుంచైతే ఏమిటి? వీలు చిక్కినప్పుడు క్లాసులు వింటాను. మిగిలిన సమయంలో పని చేసి అమ్మకు సాయంగా వుంటాను' అని చెప్పాడు. చిన్నతనంలోనే తండ్రి కోల్పోయిన ఆ బాలుడు ఇక్కడకు రాకముందు జార?ండ్‌లో తన సొంత గ్రామంలోనే చదువుకునేవాడు. అతనితో పాటే పనిచేస్తున్న మరో బాలుడి కథ కూడా ఇంచుమించు ఇలాగే ఉంది. బెంగాల్ నుంచి నోయిడాకు చేరుకుని ఈ దాబాలో పని చేస్తున్నాడు. 'లాక్‌డౌన్ తరువాత 12-14 ఏళ్ల వయసున్న చాలామంది పిల్లలు పని వెతుక్కుంటూ ఇక్కడకు వస్తున్నారు. వారికి పని ఇవ్వడం నాకు ఇష్టం లేదు. ఇక్కడ కాకపోతే మరోచోటైనా వారికి పని ఇచ్చేవారు ఉంటారు. వారికి ఆ పని ఎంతో అవసరం కూడా' అంటాడు దాబా యజమాని. లాక్‌డౌన్ సమయంలో తల్లిదండ్రులు పనికోల్పోవడంతో వృత్తిశిక్షణ వైపు చాలామంది పిల్లలు తరలిపోయారు. స్కూళ్లు మూతబడి చదువుకు దూరమైన పిల్లలు ఒత్తిడికి గురవ్వకుండా ఉండాలంటే వృత్తి శిక్షణలో నైపుణ్యం సాధించడమే మేలని, ఆ పని వారికి కొంత ఉపశమనంగా వుంటుందని తల్లిదండ్రులు భావిస్తున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నోయిడాలో మాత్రమే ఈ పరిస్థితి లేదు. మన చుట్టుపక్కల హొటళ్ళు, షాపుల్లో లేదా బిల్డింగ్‌లు, అపార్టుమెంటుల వంటి పెద్ద పెద్ద ఇళ్ల మరమ్మతులు చేయించుకునే దగ్గర ఇప్పుడు పెద్దవారితో పాటు చిన్నపిల్లలూ పనులకు వస్తున్నారు. కరెంటు పనివారిగా, వడ్రంగి పనివారిగా, ఇతర వృత్తిపనివారితో పాటు వారి పిల్లలు రావడం ఈ మధ్య ఎక్కువైంది. స్కూలుకు వెళ్లడం లేదా? అని ఎవరైనా ప్రశ్నిస్తే ఆన్‌లైన్ లోనే కదా? ఇంటికి వెళ్లి చదువుకుంటాను అని సమాధానం వస్తోంది. ఒక సర్వే ప్రకారం దేశంలో అల్పాదాయ కుటుంబాల పిల్లల్లో 78 శాతం మంది లాక్‌డౌన్‌కు ముందు కాలమే చదువుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉందని చెప్పారు. ఆన్‌లైన్ క్లాసుల వల్ల స్కూలు వాతావరణం, ఆమేర అధ్యయనం లేదు. పైగా ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యే బాలికలలో 2/3 శాతం మందిపై ఇంటి పనులు, పిల్లల సంరక్షణ వంటి పనుల భారం పడిందని తేలింది. షెడ్యూల్ తెగలు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన కులాలు, మైనార్టీ కుటుంబాలకు చెందినవారి పిల్లలు కోవిడ్ తదనంతర పరిస్థితులపై చేసిన సర్వేలో ఈ విషయాలు వెలుగు చూశాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, అసోం, తెలంగాణ, ఢిల్లీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసించే 3 వేలకు పైగా కుటుంబాలను సర్వేలో కలుసుకున్నారు.

# లొంగుబాటుకు పురస్కారం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని నరేంద్ర మోడీకి ప్రదానం చేసిన 'లెజియన్ ఆఫ్ మెరిట్' అవార్డు గురించి సమాచారం కొంత ఆసక్తికరంగా వుంటుంది. అమెరికా అధ్యక్షుడు అందజేసే ఈ అవార్డు, ప్రాథమికంగా ఒక సైనిక పురస్కారం. చీఫ్ కమాండర్ కేటగిరీ అయిన దీన్ని గతంలో ఇతర దేశాల సాయుధ బలగాల ఆర్మీ చీఫ్‌లకు, జనరల్స్‌కు, కమాండర్ ఇన్ చీఫ్ లకు అందజేసేవారు. చాలా కొద్ది మంది దేశాధినేతలకు లేదా ప్రభుత్వాధినేతలకు, మరీ ముఖ్యంగా అమెరికాకు సైనికంగా అత్యంత సన్నిహిత మిత్రులకు మాత్రమే ఈ అవార్డు ఇచ్చారు. గత 29 ఏళ్ళలో అమెరికాకు వెలుపల ఏ ఒక్కరికీ ఈ అవార్డు ప్రదానం చేయలేదు. వాస్తవానికి, అమెరికాలో అత్యున్నత పౌర పురస్కారమైన 'ది ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'ను 1963లో నెలకొల్పారు. వరుసగా వచ్చిన అమెరికా అధ్యక్షులందరూ విదేశీ నేతలకు, విశిష్ట వ్యక్తులకు ఈ అవార్డును అందచేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ అవార్డు 1985లో భారతీయ పౌరురాలైన మదర్ థెరిస్సాకు అందజ్జేశారు.కానీ, ట్రంప్, మోడీకి అందజేసింది ప్రత్యేకంగా సైనిక పురస్కారం. "ప్రపంచ సవాళ్ళను ఎదుర్కొనేందుకు అమెరికా, భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం పెంపొందడానికి మోడీ చేసిన కృషికి గాను ఈ అవార్డును అందచేస్తున్నట్లు ఆ ప్రశంసా పత్రం పేర్కొంటోంది. అమెరికా సైనిక మిత్రపక్షంగా మోడీ కొత్తగా సాధించిన పదవికి ఇదొక గుర్తింపు. భారత ప్రధానిగా మోడీ విశిష్టమైన సేవలందించారని ఆ ప్రశంసా పత్రం పేర్కొంది. లాజిస్టిక్స్ సప్లై అగ్రిమెంట్ (ఎల్ఇఎంఒఎ), ఆ తర్వాత మరో రెండు ప్రాథమిక ఒప్పందాలపై సంతకాలు చేయడం ద్వారా అమెరికా సైనిక మిత్రపక్షంగా భారత్ మారడంలో మోడీ నిర్ణయాత్మక పాత్ర పోషించారని అమెరికా భావిస్తోంది.ఇటీవల వరకు జపాన్ ప్రధానిగా చేసిన షింజో అబె, ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్‌లకు కూడా ఏక కాలంలో ఈ పురస్కారాన్ని ట్రంప్ ప్రదానం చేశారు. అమెరికా నేతృత్వం లోని నాలుగు దేశాల కూటమి (క్వాడ్)లో చేరేందుకు తమ దేశాలను ముందుంచడంలో ఈ ముగ్గురు కీలకంగా పని చేశారు. క్వాడ్ ను సైనిక కూటమిగా పెంటగన్ భావిస్తోంది. ట్రంప్‌తో సైనిక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నందుకు ఈ లెజియన్ మెడల్ అనేది ముగ్గురు నేతలకు గుర్తింపు వంటిదనుకుంటే అంతకన్నా కీలకమైన అంశం మరొకటి వుంది. ఈ ముగ్గురూ ట్రంప్‌తో తమ సన్నిహిత రాజకీయ అనుబంధాన్ని వ్యక్తం చేసిన మితవాద నాయకులే. 2019 సెప్టెంబరులో హూస్టన్ ర్యాలీలో మోడీని ట్రంప్ ధ్రువీకరించగా, అదే నెలలో ఓహియోలో జరిగిన ట్రంప్ ర్యాలీకి మోరిసన్ హాజరయ్యారు. హూస్టన్‌లో "అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్" (ఈసారి ప్రభుత్వం ట్రంప్‌దే) అని మోడీ పునరుద్ఘాటిస్తే, మోరిసన్ మరింత చురుకైన వ్యక్తి. ట్రంప్ తిరిగి ఎన్నికవడం గురించి ప్రశ్నించగా "మేం ఒకే రకమైన అభిప్రాయాలు పంచుకుంటాం." అని ప్రకటించారు. ఇక షింజో అబెకు ట్రంప్‌తో చాలా సన్నిహితమైన వ్యక్తిగత సంబంధాలున్నాయి. ఇద్దరూ కలిసి గోల్ఫ్ ఆడతారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, బ్రెజిల్ అధ్యక్షుడు జైరో బోల్సనారో వంటి తన సైద్ధాంతిక సహచరులకు ట్రంప్ ఈ అవార్డు ఇవ్వలేదంటే కొత్తగా, ప్రధానంగా సైనికంగా మిత్రపక్షాలకే ఈ అవార్డులు ఇవ్వాలన్నది పెంటగన్ నిర్ణయంగా వుందని స్పష్టమవుతోంది. శ్వేతసౌధం వీడి వెళ్లడానికి ఇక కొద్ది రోజులే గడువు వున్న సమయంలో, ట్రంప్ పలువురికి క్షమాభిక్ష పెట్టారు. వీరిలో క్రిమినల్ కేసుల్లో దోషులైన ట్రంప్ మాజీ సలహాదారు మైఖేల్ ఫ్లైయిన్ వుంటి వారున్నారు. తన సహచరులను చాలామందిని ఉన్నత పదవుల్లో ట్రంప్ నియమించారు. విదేశాల్లో వున్న తన రాజకీయ మిత్రులను కూడా ట్రంప్ మరిచిపోలేదు.అధ్యక్షుడు ట్రంప్ ఈ అవార్డుతో తనను గొప్పగా గౌరవించారని మోడీ వ్యాఖ్యానించారు. తాను అమెరికా ప్రభుత్వంతో కలిసి పనిచేస్తానని, ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతమవడానికి కృషి చేస్తానని 130 కోట్ల మంది భారత ప్రజల తరపున మోడీ హామీ ఇచ్చారు. అయితే, ఈ అమెరికన్ అవార్డు నేపథ్యం గురించి మోడీకి పూర్తి సమాచారం తెలిసినట్లుగా కనిపించడం లేదు. ఈ అవార్డును గతంలో ఇద్దరే ఇద్దరు భారతీయులు ఫీల్డ్ మార్షల్ కరియప్ప, జనరల్ ఎస్.ఎం.శ్రీనగేష్‌లు వరుసగా 1950, 1955ల్లో అందుకున్నారు. వీరిద్దరూ ఆర్మీ చీఫ్‌లే. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్ సైన్యం తరపున పోరాడారు. ఆ రోజుల్లో, ప్రపంచవ్యాప్తంగా వివిధ సాయుధ బలగాల చీఫ్‌లకు లెజియల్ మెడల్ అందజేసేవారు. అలా అందుకున్న వారిలో నేపాల్ ఆర్మీ చీఫ్ కూడా వున్నారు.మూడు దశాబ్దాలుగా ఈ అవార్డును ఎవరికీ ఇవ్వలేదు. ఇప్పుడు ట్రంప్ అకస్మాత్తుగా, ఆ అవార్డును విదేశీ నేతలకు అందజేయడాన్ని పునరుద్ధరించారు. ఈ ఏడాది సెప్టెంబరులో కువైట్ చివరి చక్రవర్తికి అందజేశారు. ట్రంప్‌కు సంబంధించినంతవరకు, ఈ అవార్డును ఇవ్వడమంటే చైనాపై పోరులో సహకరించిన తన మిత్రపక్షాలకు తన పదవీ కాలం చివరిలో చెప్పుకున్న కృతజ్ఞత వంటిదే. పెంటగన్‌కి అయితే ఈ సైనిక కూటమిని మరింత పటిష్టపరచాలన్నది లక్ష్యంగా వుంది. అయినప్పటికీ, ఈ పురస్కారం పట్ల మోడీ సంతోషం వ్యక్తం చేయడమంటే దురదృష్టవశాత్తూ, భారత్, అమెరికాకు లంగి వుండే సైనిక మిత్రపక్షంగా మారిందనే వాస్తవాన్ని గుర్తించడమే కాగలదు.



## రాఘవ రెడ్డికి ఘన నివాళి

ఖమ్మం జిల్లా పాలేరు, డిసెంబర్ 30, ప్రజాపాలన : వరంగల్ జిల్లా దంతాలపల్లి మండలం రేపూరు గ్రామంలో గంజికుంట్ల వెంకన్న. బచ్చల కూరి నాగరాజు. జెర్రిపోతుల సత్యనారాయణ. రేవూరు గ్రామం వెల్లి సాధు రమేష్ రెడ్డి గారి తండ్రి గారు రాఘవ రెడ్డిగారు ఇటీవల మృతి చెందగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగినది వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి జరిగినది.

## తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలు కటారి రేవతి రావును అభినందించిన సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



వెల్గటూర్, డిసెంబర్ 30 (ప్రజాపాలన): తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమితులైన సందర్భంగా కటారి రేవతి రావును తెలంగాణ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అభినందించారు. బుధవారం కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. మహిళ కమిషన్ సభ్యురాలిగా నియమితులైన కటారి రేవతి రావును ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్షణ

### తెలంగాణ సాంస్కృతిక సారథి మోత్కుపల్లి సంజీవ్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 30 ( ప్రజాపాలన ) : పరిశుభ్రత, హరిత హారం, కరోన మహమ్మారి గురించి తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి జిల్లా కలెక్టర్ పౌసుమి బసు ఆదేశాల మేరకు అవగాహన కల్పించామని తెలంగాణ సాంస్కృతిక సారథి మోత్కుపల్లి సంజీవ్ తెలిపారు. బుధవారం జిల్లా పరిధిలోని వికారాబాద్ మండలానికి చెందిన సర్పన్ పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ షాకేరా బేగం, మండల ఉపాధ్యక్షుడు ఫకీర్ ఖాన్, ఎంపిటిసి పుష్పలత, కార్యదర్శిల ఆధ్వర్యంలో కళాజాత బృంద సభ్యులు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జి బిక్షపతి జి శంకర్ వి అర్చన గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## వరుస వివాదాలతో సుధీర్ రెడ్డి

**కడప, డిసెంబర్ 30, (ప్రజాపాలన) :** ఆయన తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంది వచ్చిన అవకాశాన్ని చేజార్చుకుంటున్నారు. తన నియోజకవర్గం పరిధిలో అందరితో శతృ త్వం పెంచుకుంటున్నారు. ఇది అధిష్టానం దృష్టికి వెళ్లినా పెద్దగా లెక్క చేయడం లేదు. జమ్మల మడుగు వైసీపీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కి శత్రు వులు పెరుగుతున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికయిన పదిహేడు నెలల్లోనే లెక్కకు మించి శత్రువులను ఆయన తయారు చేసుకుం టున్నారు. దీనికి ప్రధాన కారణం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్వయంకృతాపరా ధమేనంటున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం వైఎస్ కుటుంబానికి కంచుకోట వంటిది. 2014 ఎన్నికల్లోనూ ఆదినారాయణరెడ్డి వైసీపీ గుర్తు మీదే గెలిచారు. ఆయన టీడీపీ లోకి వెళ్లడంతో సుధీర్ రెడ్డికి పార్టీ టిక్కెట్ ఇచ్చింది. వైద్యుడిగా మంచి పేరు ఉండటం ఈయనకు కలసి వచ్చింది. సుధీర్ రెడ్డి విజయానకి హత్యకు గురైన వివేకానందరెడ్డితో పాటు ప్రస్తుత ఎంపీ అవినాష్ రెడ్డి విశేషంగా కృషి చేశారు. వైఎస్ కుటుంబానికి నియోజకవర్గంలో ఎక్కువ మంది అభిమానులు ఉండటంతో సుధీర్ రెడ్డి గెలుపు సాధ్యమయింది.వైఎస్ జగన్ కు తాను వీరవిధేయుడినని సుధీర్ రెడ్డి నిత్యం చెబుతుంటారు. అయితే ఆయన వ్యవహారశైలి మాత్రం పార్టీకి ఇబ్బందులు తెచ్చిపెడుతుం ది. టీడీపీ నుంచి వైసీపీలో చేరిన రామసుబ్బారెడ్డితో సుధీర్ రెడ్డికి పొసగడం లేదు. ఇటీవల హత్యలు కూడా చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో తన సొంత జిల్లాలోని జమ్మలమడుగులో పార్టీలో తలెత్తిన అసమ్మతిని పారదోలేందుకు జగన్ అవినాష్ రెడ్డిని మధ్యవర్తిగా పంపిన ట్లు తెలిసింది. అయినా పెద్దగా ఫలితం కన్పించడం లేదు.

# మీర్పేట్ కార్పొరేషన్ కమిషనర్ విధి నిర్వహణ లో జరిగిన సంఘటనకు బిజెపి ధర్నా





బాలాపూర్ : ప్రజాపాలన: మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 119 సర్వేనెంబర్ గుడిసెల దగ్గర బిజెపి పార్టీ జెండా ఆవిష్కరణ కు ఆటంకం జరిగిందని స్థానిక కార్పొరేటర్ తో పాటు కార్పొరేషన్ కార్పొరేటర్లు బీజేపీ నేతలు వాపోయారు. మీర్పేట్ కమిషనర్ సుమన్ రావు అధికార హెూదాతో బీజేపీ పార్టీ జెండాను ఆవిష్కరించే కుండా అడ్డుపడి వారి సిబ్బందితో దిమ్మె కూలగొట్టడం జండా పెట్టొద్దని తీసేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు....? మంగళవారం జరిగిన సంఘటనకు బుధవారం నాడు మీర్పేట్ కార్యాలయం ముందు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బిజెపి నేతలు అందరూ ధర్నా నిర్వహించారు. 29వ డివిజన్ కార్పొరేటర్ నీల రవి నాయక్ మద్దతుగా బిజెపి నేతలందరూ వివిధ కార్పొరేషన్ కార్పొరేటర్లు కంటెస్టెంట్ కార్పొరేటర్లు కమిషనర్ కిందికొచ్చి సారీ చెప్పాలి! అదేవిధంగా ఎన్నో లక్షల మంది బీజేపీ జెండా నీడలో నడుస్తున్న మా జెండాను అవమానపరిచిన అందుకు అక్కడ దిమ్మెను కట్టించాలినీ మా జండా ఆవిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆ ప్రదేశంలో ఎవరైనా ప్రజలు అబ్జెక్షన్ జరుగుతే ఎక్కడైనా కమిషనర్ ఆ డివిజన్లో కార్పొరేటర్ కు స్థలం చూపెట్ట గలరునీ ముక్తకంఠంతో బిజెపి నేతలందరూ డిమాండ్ చేశారు. మీర్పేట్ కమిషనర్ సుమన్ రావు వివరణ ఇస్తూ.... మంగళవారం విధి నిర్వహణ పర్యవేక్షణలో మాత్రమే వెళుతున్న సందర్భంలో 29వ డివిజన్ కార్పొరేటర్ నీలా రవి నాయక్ కొంతమంది జనంతో పార్టీ జెండా పెట్టడానికి దిమ్మె కట్టేస్తుంటే వద్దు ఇక్కడ కట్టడం మంచిది కాదు అని నచ్చ చెప్పాను, అదేవిధంగా వారికి కార్పొరేటర్ కు తెలంగాణ ఏర్పడినప్పటి ఇప్పటివరకు మీర్పేట్ కార్పొరేషన్లో ఎక్కడ ఏ జెండా దిమ్మెను కట్టలేదు..... జిల్లా కలెక్టర్ ఆదేశించారు పకడ్బందీగా కట్టవద్దని చెప్పారునీ కార్పొరేటర్ కు స్థానికులకు చెప్పడం జరిగింది. అంతలోనే స్థానిక కార్పొరేటర్ బిజెపి నేతలకు ఫోన్ చేసి చెప్పడం వల్ల వెంబడే వాళ్ళు బిజెపి కార్యకర్తలు వచ్చారు. మేము మీర్ పేట పోలీస్ సీఐ ని సంప్రదించగా మరియు పోలీస్ సిబ్బంది తో మున్సిపల్ సిబ్బంది తో అక్కడ కడుతున్న దిమ్మెను కొల్లగొట్టడం జరిగింది.నేను ఎవర్ని అసభ్యంగా మాట్లాడలేదు...., ఏ పార్టీని విమర్శించలేదు..... ఎవర్ని ఒక మాట అనలేదు... ఎవరి మీద నాకు ఎలాంటి కోపం అసూయ లేదని విలేకర్ల సమావేశంలో వివరణ ఇచ్చారు. నా యొక్క విధి నిర్వహణ నిర్ణయించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నర్సింహా రెడ్డి, రాష్ట్ర నాయకుడు కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి మాజీ సింగిల్విండో చైర్మన్ కోలన్ శంకర్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం అందెల శ్రీ రాములు యాదవ్, మీర్పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు బడంగ్పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, వివిధ డివిజన్ల మోర్చీ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, యువకులు బిజెపి నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ధర్నా సంఘటనలో టిఆర్ఎస్ నేతలు విలేకరుల సమావేశం



బాలాపూర్ : ప్రజాపాలన :రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం మహేశ్వరం నియోజకవర్గం మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు వారి మీద బిజెపి నాయకులు చేసిన అసభ్యంగా కార్యాలయము నందు ధర్నాకు దిగడంతో తీవ్రంగా మీర్పేట స్థానికులు టిఆర్ఎస్ నేతలు ఖండిస్తున్నామని అన్నారు. బీజేపీ మహేశ్వరం ఇన్చార్జ్ శ్రీ రాములు యాదవ్ వారి అనుచరుల మీద ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్ట ప్రకారం కఠినంగా చర్యలు తీసుకోవాలని మహేశ్వరం నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్(బాలన్న ) . మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు సిద్ధల లావణ్య బీరప్ప.. టిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి.. మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్కల కామేష్ రెడ్డి. మహేశ్వరం నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు బండి మీనా నాగేష్ యాదవ్. మీర్పేట్ టిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు ఇంద్రావతి రవి నాయక్, జి. రవి నాయక్, గజ్జల రామచందర్, అక్కి మాధవి తీగల మాధవి, జిల్లా లా అరుణ ప్రభాకర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, డీ. జ్యోతి కిషన్, సురేఖ రమేష్, సిద్ధల పద్మఅంజమ్మ రజాక్, మాజీ ఎం.పీ టి సి లు ఎరుకల రవి గౌడ్. లలిత జగన్... లతా శేఖర్ గౌడ్.....కాంటెస్టెడ్ కార్పొరేటర్లు.. భూమేష్ గౌడ్ బాల రాజు, దాసరి కిరణ్, దయానంద్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు.. బీసీ సెల్.. ఎస్ టి సెల్.. ఎస్సీసెల్ నాయకులు. కో ఆప్షన్ సభ్యులు తో కలిసి మీర్ పేట లో విలేకరుల సమావేశం లో చెప్పారు. ఈ సందర్భంగా బేర బాలకిషన్(బాలన్న ) మాట్లాడుతూ.... కార్పొరేషన్లో బిజెపి నాయకులు సొంత వ్యాపారాల రక్షణకోసం స్వార్థ రాజకీయాలు చేస్తూ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు మరియు అధికారుల ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్నారని అన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నెలరోజులుగా. కరోనా మహమ్మారి వరదల ప్రభావం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూరు. ఈ సమయంలో పగలు రేయి అనగా పనిచేసిన కమిషనర్ సుమన్రావు మీద కక్ష పెట్టుకొని.. మహేశ్వరం బీజేపీ ఇంచార్జ్ శ్రీ రాములు యాదవ్ అతని అనుచరులు . భయభ్రాంతులకు గురి చేయడానికి అధికారుల అసభ్యంగా మాట్లాడడం దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.. మున్సిపల్ కమీషనర్ సుమనరావు ను చంపుతామని బెదిరించినా వాళ్లపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేసి అరెస్టు చేయాలని. కమిషనర్ సుమన్ రావు కు పోలీసులతో రక్షణ కల్పించాలని. మీర్ పేట సంఘటన మీద రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ గారిని కలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ కలలుగన్న సమాజాన్ని నిర్మిద్దాం

### తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్





వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 30 ( ప్రజాపాలన ) : కుల వివక్ష, రెండు గ్లాసుల విధానం, అంటరానితనం, అస్పృశ్యత, పైకెత్తి పోసే విధానం, దళితులను దేవలయాలలోనికి రానివ్వకపోవడం, దళితుల భూములను లాక్కోవడం వంటి వాటిని నిర్మూలింపబడాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్ సూచించారు. బుధవారం జిల్లా పరిధిలోని వికారాబాద్ మండలానికి చెందిన కామారెడ్డి గూడ గ్రామంలో గ్రామ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ పౌసుమి బసు, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో ఏర్పాటు చేసిన పౌరహక్కుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌరహక్కుల దినోత్సవం అవగాహన సమావేశానికి దేవాదాయ శాఖ విధిగా హాజరవ్వాలని పేర్కొన్నారు. ముఖ్యంగా సమస్యలు వచ్చేవి దేవాలయాల ప్రవేశమేనని ఎత్తి చూపారు. సివిల్ రైట్స్ డేకు ప్రభుత్వం నుండి ఎండోమెంట్, పోలీస్, రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, విద్యా శాఖ, విద్యుత్, వ్యవసాయ శాఖ వంటి మొత్తం 18 ప్రభుత్వ శాఖలు పాల్గొనాలని గుర్తు చేశారు. సిఎం కేసిఆర్ అమలు పరుస్తున్న 30 రోజుల పల్లె ప్రగతిలో పౌర హక్కుల దినోత్సవాన్ని ప్రతి పల్లెలో సంబంధిత అధికారులు పకడ్బందీగా నిర్వహిస్తే సమాజంలో అసమానతలు ఉండవన్నారు. జిఒ నంబర్ 27, 29 చట్టాలను ప్రతి గ్రామంలో గ్రామ సభలలో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కమీషన్ పౌరుల హక్కులను రక్షిస్తుందని, కార్పోరేషన్ రుణాలను మంజూరు చేస్తుందని వివరించారు. గ్రామాలలో అక్కడక్కడ మాత్రం ఇంకా కొనసాగుతుందని, నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 580 మండలాల్లో ప్రతి నెల చివరి రోజు పౌర హక్కుల దినోత్సవం ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

యువత చట్టాల పట్ల అవగాహన కల్గి ఉండాలి:

వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ..అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అందరూ సక్రమంగా పాటిస్తే ఎవరికీ ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. దీనికోసం ప్రతి ఒక్కరు చట్టాల పట్ల అవగాహన కల్గి ఉండాలన్నారు. అందుకే యువత చదువు పట్ల నిర్లక్ష్యం చేయొద్దన్నారు. నేటి యువత హక్కులు తెల్సుకోవటంతో పాటు బాధ్యతలను కూడా విస్మరించకుండా కుటుంబం పట్ల సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ పౌసుమి బసు, అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఆర్డిఒ ఉపేందర్, డిఆర్డిఎ కృష్ణన్, ఎంపిడిఒ సుభాషిణి, మండల పార్టీ అధ్యక్షుడు నారెగూడెం కమాల్ రెడ్డి, ఉప సర్పంచ్ మహేందర్ రెడ్డి, కమీషన్ సభ్యులు విద్యా సాగర్, రాంబల్ నాయక్, నర్సింలు ఇతర అధికారులు మరియు పార్టీ నాయకులు గ్రామస్థులు ఇతరులు పాల్గొన్నారు.

# గిరిజనుల హక్కులను కాలరాస్తున్న ఎమ్మార్వో ను బదిలీ చేయాలి

### తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కొట్నాక విజయ్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి (ప్రజాపాలన): జిల్లా లోని కెరమెరి మండలం లో గిరిజనుల హక్కులను కాలరాస్తున్న ఎమ్మార్వో ను వెంటనే భర్తీ చేయాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కొట్నాక విజయ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ కెరమెరి మండలం లో సర్వే నెంబర్ 94 లో గిరిజనులకు మాత్రమే రిజిస్ట్రేషన్ అవకాశం ఉందని అన్నారు. అయితే ఎమ్మార్వో ఇష్టారాజ్యంగా ఇతరులకు భూములు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై గతంలో కలెక్టర్ కు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాసిల్దార్ ఇష్టారాజ్యంగా భూములు రిజిస్ట్రేషన్ చేయడం, పట్టా పాస్ బుక్కులు ఇవ్వడంతో గిరిజనులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆయన అక్కడి నుండి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ప్రసన్నాంజనేయ దేవస్థానంలో విగ్రహ సంప్రోక్షణ





మధిర రూరల్ న్యూస్ : ఖమ్మం జిల్లా మధిర మండలం బుధవారం ఆత్కూరు గ్రామం నందు వేచి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి గుడి నందు ఆత్కూరు గ్రామ సర్పంచ్ అబ్బూరి సంధ్య రాణి వైఫ్ ఆఫ్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహం సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో వేద పండితుల మధ్య మంత్రోచ్చారణ కార్యక్రమం నిర్వహించి అత్యంత వైభవోపేతంగా ఉత్సవ విగ్రహం పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది

## రెండు గ్లాసుల బీరు.. గుండెకు మేలు!



మద్యపానం ఆరోగ్యానికి హానికరం.. టీవీల్లో, సినిమాహాల్లో మనకు తరచు వినిపించే.. కనిపించే నినాదాలు. కానీ, రోజూ రెండు గ్లాసుల బీరు అంటే సుమారు 290 మిల్లీలీటర్ల బీరు మన గుండెకు మంచిదని కొత్త అధ్యయనం చెబుతోంది! హార్వర్డ్ మెడికల్ యూనివర్సిటీ పరిశోధకులు 15 వేల మంది మందుబాబులపై (మహిళలు కూడా) అధ్యయనం చేశారు. వారానికి ఏడు డ్రింకులు, 7-14, 14-21, 21పైన డ్రింకులు చేసే 45-64 ఏళ్ల వయసున్న వారిపై అధ్యయనం చేశారు. అయితే యుక్త వయసు నుంచి నడివయసు వారి వరకు ఏడు డ్రింకుల తీసుకునే వారిలో గుండె జబ్బుల ప్రమాదం 20 శాతం తక్కువని తేలింది. అదే ఎక్కువ డ్రింకులు తీసుకున్న వారిలో 1,271 మంది పురుషులు, 1237 మహిళలు గుండె జబ్బుల బారిన పడ్డారని శాస్త్రవేత్తలు గుర్తించారు. అందుకే రోజు రెండు గ్లాసుల బీరు తీసుకుంటే గుండెకు ముప్పు తక్కువని చెబుతున్నారు.

## ఆస్పిరిన్‌తో మేలెవరికి?




అమెరికాకు చెందిన ప్రివెంటివ్ సర్వీసెస్ టాస్క్ ఫోర్స్ వారు ఆస్పిరిన్ మాత్రలకు సంబంధించి ఇటీవల మరో కొత్త ప్రతిపాదన చేశారు. గుండెపోటు, పక్షవాతాలకు గురి కాకుండా ఉండడానికి 50 – 59 ఏళ్ల మధ్య వయసున్న వారు తక్కువ మోతాదులో రోజూ ఆస్పిరిన్ మాత్రలు వేసుకోవడం మంచిదే అంటున్నారు. ముఖ్యంగా గుండెపోటుకు గురయ్యే ప్రమాదానికి చాలా దగ్గరగా ఉన్నవారికి ఈ మాత్రలు ఎంతో అవసరమని చెబుతున్నారు. ఈ తక్కువ మోతాదు ఆస్పిరిన్ 50 లోపు వయస్కులకు , అలాగే 70 ఏళ్లకు పైబడిన వారికి పెద్దగా ఉపయోగపడక పోవచ్చునంటూ వ్యాఖ్యానించారు. అయితే 60 ఏళ్ల వయస్కుల్లో గుండె పోటు, పక్షవాతం రాకుండా ఉంచడంలో ఇవి ఉపయోగపడవచ్చు కాకపోతే ఆ ప్రయోజనం కూడా చాలా పరిమితమే. అయితే ఓ పదేళ్ల పాటు రోజూ ఆస్పిరిన్ తీసుకుంటే వారికి పెద్ద పేగు కేన్సర్ వచ్చే అవకాశాలు బాగా తగ్గిపోతాయన్నారు. టాస్క్ ఫోర్స్ వారు ఈ విషయమై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇదే తొలిసారి. 'గుండె జబ్బుల్ని నిరోధించడానికి ఆస్పిరిన్ మాత్రలు వేసుకునే వారు మలాశయ కేన్సర్ వచ్చే అవకాశాలూ తక్కువ. అయితే గుండె జబ్బులకు గురయ్యే పెద్ద ప్రమాదం లేనప్పుడు మలవాహిక కేన్సర్‌ను నివారించేందుకు ఆస్పిరిన్ తీసుకొమ్మని సూచించం. తక్కువ మోతాదు ఆస్పిరిన్ మాత్రల వల్ల ప్రాథమిక స్థాయిలో గుండెపోటు, పక్షవాతం, మలాశయ కేన్సర్‌లను నిరోధించే అవకాశాలు ఉన్నాయనేది వాస్తవం. ఇలాం టి ప్రమాదాలు ఉన్న 50 – 59 ఏళ్ల మధ్య వయస్కులు ఈ మాత్రలు తీసుకుంటే వారి జీవిత కాలం కనీసం పదేళ్లు కొనసాగే అవకాశం కూడా ఉంటుంద'ని వారు వ్యాఖ్యానించారు.

## అవకాడోతో ఆరోగ్యం..



రోజుకో అవకాడో పండును తినడం ద్వారా శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను బయటికి సాగనంపవచ్చని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అంతేకాదు దీంతో గుండెజబ్బులు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతోందని అమెరికా పరిశోధకులు చెబుతున్నారు. ఈమేరకు నలభై ఐదు మంది ఆరోగ్యవంతులైన స్థూలకాయులపై ఐదు వారాల పాటు పరిశోధన జరిపి ఈ విషయాన్ని కనుగొన్నట్లు వారు వివరించారు. ఈ అధ్యయనంలో భాగంగా.. 17 నుంచి 70 ఏళ్ల వయస్సున్న 45 మంది స్థూలకాయులను ఎంపిక చేసి వారికి గ్రూపులుగా విభజించారు. కొలెస్ట్రాల్ తగ్గించేందుకు ఒక్కో గ్రూపునకు ఒక్కో విధానాన్ని అవలంభించారు. సాధారణంగా తినే ఆహారంతో పాటు రోజుకో అవకాడో పండును తిన్న గ్రూపులో మిగతావారితో పోల్చితే చెడు కొలెస్ట్రాల్ తగ్గిపోవడం గమనించినట్లు శాస్త్రవేత్తలు వివరించారు.

## క్రాన్‌బెర్రీ జ్యూసు గుండెకు మంచిది...



తక్కువ క్యాలరీలుండే క్రాన్‌బెర్రీ జ్యూసు రోజుకు రెండుసార్లు తాగితే గుండెకు ఎంతో మంచిదట. దీన్ని రోజూ తాగడం వల్ల గుండె జబ్బులు వచ్చే రిస్కు 10 శాతం, స్ట్రోక్ వచ్చే రిస్కు 15 శాతం తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. పండ్లను ఎక్కువ ఇష్టపడేవారు క్రాన్‌బెర్రీలను తప్పనిసరిగా తాము తినే పండ్ల జాబితాలో చేర్చాలని సూచిస్తున్నారు. తక్కువ క్యాలరీలు ఉన్న క్రాన్‌బెర్రీ జ్యూస్ వల్ల క్రానిక్ జబ్బులైన డయాబెటిస్, స్టోక్ర్, గుండెజబ్బుల తీవ్రతను తగ్గించవచ్చు. క్రాన్‌బెర్రీస్‌లోని పోలిఫెనాల్స్ వంటి ప్రొటెక్టివ్ కాంపౌండ్స్ శరీరానికి ఎంతో మంచి చేస్తాయి. పోలిఫెనాల్స్ శరీరం యొక్క సహజసిద్ధమైన రక్షణ వ్యవస్థను కాపాడతాయి. దీంతో ఆరోగ్యవంతమైన, సమతుల్యమైన జీవనశైలి అలవడుతుంది. శరీరారోగ్యం మెరుగుపడుతుంది. పోలిఫెనాల్స్ పుష్కలంగా ఉన్న క్రాన్‌బెర్రీస్‌పై ఇటీవల కొందరు శాస్త్రవేత్తలు ఒక అధ్యయనాన్ని కూడా చేపట్టారు. అందులో భాగంగా యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ తోడ్పాటుతో 50 ఏళ్ల పైనున్న ఆరోగ్యవంతమైన 56మందికి ఎనిమిదివారాలపాటు పౌష్టిక ఆహారాన్ని అందజేశారు. అధ్యయనం ప్రారంభంలో, ముగింపులో వీరి రక్తపోటు, బ్లడ్‌షుగర్, బ్లడ్ లిపిడ్స్, సి–రియాక్టివ్ ప్రొటీన్‌లను పరిశీలించారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న సభ్యుల్లో కొందరికి రోజుకు రెండు సార్లు తప్పనిసరిగా తక్కువ క్యాలరీలున్న క్రాన్‌బెర్రీ జూసును ఇచ్చారు. మరో గ్రూపు వారికి ప్లాసెబొ బెవరేజ్‌ని ఇచ్చారు. ఇది కూడా చూడడానికి క్రాన్‌బెర్రీ జ్యూసులాగ ఉండడమే కాదు దాని ఫ్లేవర్ సైతం క్రాన్‌బెర్రీని పోలి ఉంటుంది. ఇంతకూ ఈ అధ్యయనంలో తేలిందేమిటంటే క్రాన్‌బెర్రీ జ్యూసు తాగినవారు ఆరోగ్యంగా ఉండడంతోపాటు వారికి గుండెజబ్బుల రిస్కు 10 శాతం వరకు తగ్గింది. అలాగే స్ట్రోక్ రిస్కు కూడా 15 శాతం తగ్గింది. దీన్ని బట్టి అర్థమైన విషయమేమిటంటే పోలిఫెనాల్స్ మన శరీరాన్ని రక్షించడమే కాకుండా ఎన్నో జబ్బులు మన దరికి రాకుండా సంరక్షిస్తాయి. సో...మీరు కూడా ప్రతిరోజూ క్రాన్‌బెర్రీ జ్యూస్ తాగండి.... ఆరోగ్యంగా ఉండండి.

# ఆధునిక చికిత్సలతో గుండెకు రక్ష

కొన్ని రకాల గుండెజబ్బులు పుట్టుకతోనే వస్తే కొన్ని వయసు పెరిగే కొద్దీ వచ్చే ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా ఏర్పడతాయి. గుండె జబ్బులు రాకుండా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలతోపాటు వచ్చిన తరువాత చేసుకోవలసిన వైద్య పరీక్షలు, చికిత్సల గురించి తెలియచేస్తున్నారు సన్‌షైన్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్.

గుండె జబ్బులు రాకుండా నివారించుకోవడం, వచ్చిన తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలు, గుండె జబ్బు నిర్ధారణ అయిన తరువాత చేయవలసిన శస్త్ర చికిత్సలు మొదలైన వాటిపై ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికి చాలా వరకు ఒక అవగాహన ఉంది. దీనికి మన దేశంలో ఈ సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉండటం, వార్తాసాధనాల వల్ల ప్రచారం ఎక్కువగా జరగడం కారణం. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా 15 శాతం మేరకు ఈ వ్యాధి బారిన పడుతున్నారంటే దీనికి వారి జీవనశైలి, ఆహారపు అలవాట్లు మొదలైన వాటిలో వచ్చిన మార్పులు కారణం.

### పుట్టుకతో వచ్చే గుండెజబ్బులు

పుట్టుకతో వచ్చే గుండెజబ్బులకు కొన్ని బలమైన కారణాలు ఉంటాయి. పర్యావరణం, రసాయనాలు, మందులు, ఇన్‌ఫెక్షన్లు, కొన్ని జన్యుపరమైన కారణాలు ఉంటాయి. కానీ పెద్దయిన తరువాత వచ్చే వ్యాధులు వివిధ అంశాలపై ఆధారపడి ఉంటాయి. గుండె నిర్మాణాన్ని అల్ట్రాసౌండ్ ద్వారా తెలుసుకోవచ్చు. ఎకో పరీక్ష ద్వారా కరొనరీ హార్ట్ డిసీజెస్‌ను గుర్తిస్తారు. ఛాతీ ఎక్స్‌రే కూడా అవసరమవుతుంది.

### హార్ట్ ఎటాక్ ఎందుకు వస్తుంది?

గుండె కండరాలకు రక్తాన్ని ఇచ్చి పోషించే ధమనులు మూడు ఉంటాయి. కరొనరీ ధమనుల్లో రక్తం గడ్డ కట్టి రక్త ప్రవాహానికి ఆటంకం కలిగించినపుడు వచ్చే పర్యవసానమే హార్ట్ ఎటాక్. హృదయం లోపల రక్తం ఉన్నప్పటికీ గుండెకు రక్త సరఫరా జరగదు. దీనినే యాంజైనా అంటారు. ఈ పరిస్థితిలో రోగికి ఛాతీ నొప్పి, ఊపిరి తీసుకోలేకపోవడం, క్రమంగా ఎడమ చేతిలోకి నొప్పి పాకడం జరుగుతాయి. కొన్నిసార్లు తల తిరగడం, చెమటలు పట్టడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సార్బిట్రేట్ అనే మాత్రను నోటి కింద పెట్టి కొంత వరకూ రోగిని రక్షించవచ్చు.

### ప్రథమ చికిత్స అవసరం


గుండెపోటు వచ్చిన తరువాత 20 నిమిషాల్లో రోగిని ఆసుపత్రికి తరలించాలి. వెంటనే ఇసిజి తీస్తే చాలా వరకు ఉపయోగపడుతుంది. అవసరమైతే యాస్ప్రిన్ కూడా ఉపయోగపడుతుంది. రోగిని శ్రమ పెట్టకుండా ప్రథమ చికిత్స చేయాలి. అంబులెన్స్‌ను పిలవాలి. ఆసుపత్రికి వచ్చిన తరువాత తీసే ఇసిజి గుండెపోటును నిర్ధారిస్తుంది. ఇప్పుడు లక్ష్యం అడ్డుపడిన దానిని తొలగించడం లేదా దానిని కరిగించడం. లైటిక్స్ అనే మందు 50 నుంచి 60 శాతం మాత్రమే సత్ఫలితాన్ని ఇస్తోంది. స్ట్రెస్ టెస్టులు, సి.టి, యాంజియో, రేడియో న్యూక్లియర్ ఇమేజింగ్, కార్డియాక్ ఎంఆర్ఐ వంటివి చేస్తారు. రోగికి ముందుగా ఒక యాంజియో గ్రామ్ చేస్తారు. ఇది నేడు మణికట్టు వద్ద చిన్న కోత విధించి వేస్తున్నారు. దీని ద్వారా ఎన్నిచోట్ల మూసుకుపోయిందో కచ్చితంగా చూడవచ్చు. యాంజియోప్లాస్టీ లేదా సర్జరీ లేకపోతే రోగిని అదే రోజు డిస్చార్జ్ చేయవచ్చు.

### యాంజియోప్లాస్టీ

యాంజియోప్లాస్టీ అవసరమైతే 100 శాతం అడ్డుకున్న నాళానికి ఒక సన్నని వైరు ద్వారా ఒక మెటాలిక్ సెంట్‌ను అమర్చి అడ్డు తొలగిస్తారు. ఈ ప్రక్రియలో దాదాపు 100 శాతం ఫలితాలు ఉంటాయి. ఇది అందరిలోను చేయవచ్చు. మళ్లీ గుండెపోటు వచ్చే అవకాశాలు తక్కువ. అడ్డుకట్టే అనేది చాలా క్లిష్టంగా మారితే కొన్ని ప్రత్యేక పరికరాల ద్వారా తొలగిస్తారు. ఈ దశలో శస్త్ర చికిత్సలు అవసరం కావు. రోగి రెండు మూడు రోజులు ఆసుపత్రిలో ఉండాలి. ఒకటి నుంచి రెండు వారాల్లో తన పని తాను చేసుకోవచ్చు. అనుభవం కలిగిన కార్డియాలజిస్ట్ పర్యవేక్షణలో ఇది జరగాలి. బెలూన్ డయలేషన్ 90 నిమిషాల్లో జరిగిపోవాలి. రోగి బంధువులు పర్యవేక్షకులతో మాట్లాడి తొందరగా నిర్ణయించుకోవాలి. కొంతమందికి పేస్‌మేకర్స్ వంటివి అవసరమవుతాయి.

### బైపాస్ గ్రాఫ్టింగ్

మూసుకుపోయిన ధమనులు సరిచేయటానికి మరొక విధానం బైపాస్ గ్రాఫ్టింగ్ సర్జరీ. దీనిలో సిపిడి అవసరం ఉంటుంది. రెండు చోట్ల గ్రాఫ్టింగ్ చేసేటప్పుడు ఛాతీ లోపలికి మార్గం ఏర్పరుస్తారు. ఇందులో కోతలు ఎక్కువగా ఉండేవి కాని నేడు తక్కువ కోతలతో హార్ట్ లంగ్ మిషన్ అవసరం లేకుండా కూడా ఈ సర్జరీ నిర్వహిస్తున్నాము. గుండెకొట్టుకోవడం స్థిరీకరింపచేసి అవసరమైన పరిహృదయ ధమనులు గ్రాఫ్టింగ్ చేస్తారు. ఇది 70, 80 సంవత్సరాలకు పైబడిన వారికి కూడా చేసి వారి జీవితకాలం పెంచవచ్చు. కేవలం 6 వారాలు జాగ్రత్తగా ఉండాలి. కొంతమందిలో రెండవసారి కూడా బైపాస్ సర్జరీ చేస్తారు. దీనిలో పూర్తిగా ఓపెన్ చేయకుండా సర్జరీ చేసి వ్యాధి ప్రబలత తగ్గిస్తారు. వ్యాధి వచ్చిన తరువాత కన్నా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు ముఖ్యం. మంచి ఆహారం, వ్యాయామం, కొవ్వు పదార్థాల నియంత్రణ, ఒత్తిడి తగ్గించుకోవడం, డయాబెటిస్ ఉంటే అదుపులో ఉంచుకోవడం వంటివి ఎంతో ఉపయోగపడతాయి.



# బైపాస్ అంటే భయమెందుకు

గుండెకు సంబంధించిన బైపాస్ సర్జరీ అంటే చాలామందిలో చాలా సందేహాలు, అపోహలు ఉన్నాయి. కరొనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ సర్జరీ అన్నది కేవలం ఆఖరుప్రయత్నంగా మాత్రమే చేస్తారని, ఇది వయసు పైబడిన వారికి చేయకూడదని, సర్జరీ తరువాత జీవితం కుంటుపడిపోతుందని...ఇలా చాలా అపోహలు ప్రజలలో ఉన్నాయి. అయితే అటువంటి అనుమానాలు, కాని అపోహలు కాని అవసరం లేదని అంటున్నారు సన్‌షైన్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ ఎ.ఆర్.కృష్ణప్రసాద్.

నేటి ఆధునిక వైద్య విధానంలో కరొనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్(సిఎబిజి) ఆపరేషన్ అనేది సాధారణంగా చేస్తున్న చికిత్స. ఇది ఒక్క హైదరాబాద్‌లోనే కొన్ని వందల సంఖ్యలో చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. అయినప్పటికీ నేటికీ అనేకమందికి ఈ బైపాస్ సర్జరీ మీద అనుమానాలు, అపోహలు, భయాలు, సందేహాలు నెలకొని ఉన్నాయి.

బైపాస్ సర్జరీ అంటే ఉప మార్గాన్ని సృష్టించడం. జబ్బుపడిన భాగాన్ని వదిలివేసి, ఆ భాగానికి అటూ ఇటూ ఉన్న అంచులను కలపడం. దీని ద్వారా గుండెకు రక్త ప్రసరణను మెరుగు పరచవచ్చు. తద్వారా వచ్చే ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోలేకపోవడం, ఆయాసం, అకస్మాత్తుగా సంభవించే ప్రాణహానికరమైన హార్ట్ ఎటాక్‌ను నివారించవచ్చు.

అపోహ: బైపాస్ అనేది ప్రాణాంతకమైన, ప్రమాదకరమైన ఆపరేషన్.

వాస్తవం: నిజానికి ఇది ప్రాణం కాపాడే ఆపరేషన్. అనేక ఆసుపత్రుల్లో నేడు నిష్ణాతులైన శస్త్ర చికిత్స నిపుణులు కేవలం 1 నుంచి 2 శాతం వరకు లైఫ్ రిస్క్ ఉందని నిరూపించారు.

అపోహ: బైపాస్ సర్జరీ అనేది చిట్ట చివరిగా, ఆఖరి ప్రయత్నంగా చేసే శస్త్ర చికిత్స.

వాస్తవం: ఇది అత్యధిక కేసుల్లో మంచి ఫలితం పొందటానికి మొదటిదిగా నిపుణులు సలహా ఇస్తారు.

అపోహ: వయస్సు మీరిన వారు ఈ ఆపరేషన్ చేసుకోరాదు.

వాస్తవం: 70 నుంచి 80 సంవత్సరాల వయస్సుగల వారు కూడా ఇతర ఆరోగ్య సమస్యలు లేకపోతే ఈ శస్త్ర చికిత్సకు అర్హులే. ఈ విధానం తాలూకు అతి ముఖ్యోద్దేశం రోగి తన సాధారణ జీవితాన్ని గడపడమే. వయస్సు అనేది వ్యాధిగ్రస్తునికి బైపాస్ చేయవలసి వస్తే నిర్ణయ హేతువు కాదు.

అపోహ: బైపాస్ తరువాత చాలా కఠినమైన నిబంధనలతో కూడిన జీవితం గడుపవలసి ఉంటుంది.



వాస్తవం: కేవలం 6 నుంచి 8 వారాల వరకు వైద్య సలహాలతో నిబంధనలు పాటించాలి. తరువాత చురుకైన జీవితం గడపవచ్చు.

అపోహ: బైపాస్ సర్జరీ ఒకటి కంటే ఎక్కువ రక్తనాళాలు మూసుకుపోతే చేస్తారు.

వాస్తవం: బైపాస్ సర్జరీ అనేది నేటికీ అత్యుత్తమమైన వైద్య విధానం. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో 1 నుండి 2 నాళాలు మూసుకుపోయినా ఇది ఆవశ్యకం. నేటికీ వైద్య శాస్త్ర ఫలితాల ప్రకారం దీర్ఘకాలిక ఉపశమనంగా ఈ ఆపరేషన్ నిరూపించబడింది.

అపోహ: బైపాస్ సర్జరీ సంపూర్ణ చికిత్సగా సిఎడి(గుండె ఉపిరభాగంలోని కరొనరీ ధమనుల జబ్బు)లో భావిస్తారు.

వాస్తవం: దురదృష్టవశాత్తు ఈ నాటికీ దీనికి సంపూర్ణ చికిత్స లేదు. కేవలం రెండు ప్రక్రియలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. యాంజియో ప్లాస్టీ/స్టెంట్‌లు లేదా సర్జరీ. దీని సత్ఫలితాలు సుమారు 10 నుంచి 15 సంవత్సరాల వరకూ ఉంటాయి. సందర్భానుసారం అవసరమైతే మళ్లీ ఆపరేషన్ లేదా యాంజియోప్లాస్టీ కూడా చేయవచ్చు.

# కొలెస్ట్రాల్ తగ్గాలా?



కొలెస్ట్రాల్... ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తున్న పదం. గుండె జబ్బులకు మాత్రమే కాకుండా అనేక వ్యాధులకు ఇది కారణమవుతుంది. మరి కొలెస్ట్రాల్ తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా..? చదవండి....

సాధారణంగా ప్రతి ఒక్కరికీ రోజూ 20 గ్రాముల ఫ్యాట్ అవసరం అవుతుంది. ఇది రోజూ వంట నూనెలో లభిస్తుంది. ఇది శరీరానికి సరిపోతుంది. కాబట్టి ఇతర ఆహార పదార్థాల్లో అదనంగా లభించే ఫ్యాట్‌ను తగ్గించుకోవడంపై దృష్టి సారించాలి.

వంటనూనె ఒకే రకమైనది కాకుండా మార్చుకుంటుండాలి. ఒకసారి రైస్‌బ్రౌన్ అయిల్ తీసుకుంటే మరొకసారి గ్రౌండ్‌నట్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ఇలా మార్చుకుంటూ వాడుకోవాలి.

వెల్లుల్లిలో ఐసిన్ అనే యాంటి అక్సిడెంట్ ఉంటుంది. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. రక్తనాళాల్లో క్లాట్స్ ఏర్పడకుండా కాపాడుతుంది.

వారంలో రెండు రోజులు చేపలు తినాలి. చేపల్లో ఒమెగా 3 అనే ఫ్యాటీ యాసిడ్ లభిస్తుంది. ఇది రక్తనాళాలు ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడుతుంది. రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తుంది. రక్తనాళాల్లో క్లాట్స్ ఏర్పడటాన్ని నిరోధిస్తుంది.

ఆలివ్ ఆయిల్‌లో మోనోశాచ్యురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. గుండె సంబంధ సమస్యలు రాకుండా కాపాడతాయి.

గోధుమలో ఫైబర్, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. ఫైబర్ కొలెస్ట్రాల్‌తో బైండ్ అయి శరీరం నుంచి బయటకు పంపించి వేస్తుంది. ఫైబర్ గోధుమలోనే కాకుండా ఓట్స్, బార్లీ, రాగి, జోవర్‌లలో కూడా సమృద్ధిగా లభిస్తుంది.

పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవాలి. పాల ఉత్పత్తుల్లో ఫ్యాటీ యాసిడ్స్ యాంటీ అక్సిడెంట్లు, పాలిఫెనాల్స్ ఉంటాయి. పాలిఫెనాల్స్ రక్తపోటును నియంత్రణలో ఉంచుతాయి. గుండె సంబంధ వ్యాధులు రాకుండా కాపాడతాయి.

రోజూ ఒక ఆపిల్ తినడం అలవాటు చేసుకోవాలి. ఆపిల్‌లో ఐరన్, ఫాస్పరస్, కాల్షియం, పొటాషియం, విటమిన్–ఎ, బి, సి ఉంటాయి.

క్రమం తప్పకుండా రోజూ అరగంట పాటు వ్యాయామం చేయాలి.

## గింజ గింజకో విలువ



దానిమ్మ గింజల రసాన్ని రోజుకో గ్లాసు చొప్పున తాగితే గుండె చక్కగా పనిచేస్తుంది. నిజమే.. కాని దానిమ్మ పండు గింజలు వలుచుకుని తినాలంటే మాత్రం కొద్దిగా కష్టం. కష్టమయినా దానిమ్మ గింజలు తింటే ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మరి అవేంటో తెలుసుకుందామా మిగతా పళ్లతో పోలిస్తే దానిమ్మపండులో యాంటాక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ఈ యాంటాక్సిడెంట్లు శరీరంలోని హానికారక ఫ్రీరాడికల్స్‌ను నాశనం చేస్తాయి. అలాగే వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలో వీటి పాత్ర కీలకం. రెడ్ వైన్, గ్రీన్‌టీలతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ యాంటాక్సిడెంట్లు దానిమ్మ పండులో ఉంటాయి.

అలాగే జుట్టు రాలే సమస్య నుంచి బయటపడాలంటే దానిమ్మ గింజల రసాన్ని మించింది లేదు. జుట్టు కుదుళ్లకు బలాన్నిచ్చి, మందంగా ఉంచి, ఆరోగ్యంగా కనిపించేలా చేస్తుంది దానిమ్మ రసం.

హార్మోన్ల అసమతుల్యత యాక్నె సమస్యకి కారణం. దానిమ్మ గింజలు యాక్నెను నివారించడంలో ముఖ్య భూమిక వహిస్తాయి. ఈ మ్యాజిక్ ఫ్రూట్ జీర్ణవ్యవస్థను సరిచేస్తుంది. రక్త సరఫరాను మెరుగుపరుస్తుంది. యాక్నె వల్ల దెబ్బతిన్న చర్మాన్ని బాగుచేస్తుంది.

ఈ పండులో అధిక మొత్తంలో ఐరన్ ఉం టుంది. ఐరన్ ఆక్సిజన్ రవాణాకి సాయపడుతుంది. ఆక్సిజన్ రవాణా సరిగా జరిగిందంటే చర్మం యవ్వనంతో మెరిసిపోవడం ఖాయం.

దానిమ్మరసాన్ని ముఖానికి రాసుకుంటే అది మంచి టోనర్‌లా పనిచేస్తుంది. చర్మంపై ఏర్పడే మచ్చలు, బ్లెమిషెస్‌ను తగ్గిస్తుంది దానిమ్మ. చర్మంపై ఉండే మృతకణాలను తొలగించాలంటే దానిమ్మే బెస్ట్.

ఒక గ్లాసు దానిమ్మ రసాన్ని ప్రతిరోజూ తాగితే రక్త సరఫరా బాగా జరుగుతుంది. దానివల్ల గుండె మీద ఒత్తిడి తగ్గుతుంది. రక్తం గడ్డలు కట్టకుండా చేసే గుణం దానిమ్మకు ఉంది.

### వలిచేయండిలా...

దానిమ్మపండును అడ్డంగా కోయాలి. ఇలా చేసేటప్పుడు చాకుని దానిమ్మ పండులోకి మరీ లోతుకు పోనివ్వద్దు. గింజలకు చాకు తగిలితే రసం బయటకు వచ్చేస్తుంది. అందుకని గింజల వరకు వెళ్లకుండా పైపైన కోయాలి. దానిమ్మపండు చుట్టూరా చాకుతో కోశాక చేతులతో రెండు భాగాలు చేయాలి. ఒక సగాన్ని బోర్లించినట్టు పట్టుకుని తొక్కమీద గరిటెతో కొడుతుంటే పళ్లెంలోకి గింజలు వాన జల్లులా పడతాయి.

## రోజుకు 3 కప్పుల కాఫీతో గుండెజబ్బులు దూరం



రోజు మొత్తంలో మూడు నుంచి ఐదు కప్పుల కాఫీని సేవించడం ద్వారా గుండె జబ్బులతో మరణించే ప్రమాదం 21 శాతం తగ్గిపోతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ మేరకు ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైంటిఫిక్ ఇన్ఫర్‌మేషన్ ఆన్ కాఫీ (ఐఎసఐసీ) నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. అంతేకాదు కాఫీ తాగని వారితో పోలిస్తే మూడు నుంచి ఐదు కప్పుల కాఫీ తాగేవారికి టైప్–2 మధుమేహం వచ్చే ప్రమాదం కూడా దాదాపు 25 శాతం తగ్గుతుందని పరిశోధకులు తెలిపారు. మధుమేహ బాధితులకు గుండెజబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువనే విషయం గతంలోనే వెల్లడైంది. ఈ నేపథ్యంలో తాజా పరిశోధనతో కాఫీ మధుమేహాన్ని తద్వారా గుండె జబ్బుతో మరణించే ప్రమాదాన్నీ తగ్గిస్తుందని స్పష్టమైందని పరిశోధకులు వివరించారు. కాగా, నిత్యం రద్దీగా ఉండే రహదారులకు సమీపంలో నివసించే వారికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువని మరో అధ్యయనంలో తేలింది. రోడ్లపై ప్రయాణించే వాహనాల శబ్దాలు, వాటి నుంచి వెలువడే కాలుష్యం.. చుట్టుపక్కల నివసించే వారి జీవితకాలాన్ని తగ్గిస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈమేరకు 86 లక్షల మందిని పరిశీలించి ఈ విషయాన్ని కనుక్కున్నట్లు లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రోపికల్ మెడిసిన్, ఇంపీరియల్ కాలేజ్ శాస్త్రవేత్తల బృందం పేర్కొంది.

## కీర్తిపై పెళ్లి ఒత్తిడి?



మహానటితో జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధించింది హీరోయిన్ కీర్తి సురేష్. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలతో బిజీగా ఉంది. లాక్‌డౌన్ సమయంలో చాలా మంది సినీ ప్రముఖులు వివాహాలు చేసుకున్న సంగతి తెలిసిందే. కీర్తికి కూడా ఈ ఏడాది పెళ్లి చేసెయ్యాలని ఆమె పేరెంట్స్ భావించారట. ప్రస్తుతం కీర్తి వయసు 28 సంవత్సరాలు. దీంతో పెళ్లి చేసుకోమని ఇంట్లో వాళ్లు ఒత్తిడి చేశారట. అయితే కీర్తి మాత్రం ఇప్పట్లో పెళ్లి వద్దని చెప్పేసిందట. ప్రస్తుతం అవకాశాలు భారీగా వస్తున్నాయి కాబట్టి కెరీర్‌పైనే దృష్టి పెట్టాలని ఫిక్స్ అయిందట. కీర్తి ప్రస్తుతం నితిన్ రంగ్ దేలోనూ, మహేష్ సర్కారు వారి పాటలోనూ నటిస్తోంది. అలాగే పవన్ కల్యాణ్ సరసన కూడా మరోసారి కనిపించబోతోందట.

## బాబోయ్.. వాడిపై అరియానా చాలా ఆశలే పెట్టుకుంది



తెలుగు బిగ్ బాస్ సీజన్ 4 లో అరియానా ఒక సాదా సీదా అమ్మాయిగా ఎంట్రీ ఇచ్చింది. తాను బోల్డ్ గా ఉంటాను బోల్డ్ గా మాట్లాడుతాను అంటూ ఇంట్రో వీడియోలో చెప్పిన అరియానా నిజంగా అలా ఉండలేస్తుందా అని కొందరు అనుమానం వ్యక్తం చేశారు. కాని మొదటి నుండి చివరి వరకు అరియానా ఫైటర్ లా పోరాడింది. నిజంగా అరియానా అద్భుతంగా పోరాటం సాగించింది. విజయాన్ని సొంతం చేసుకోలేక పోయినా కూడా టాప్ 4 లో ఉండి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. ఒకానొక సమయంలో అరియానా విజేత అయ్యేనేమో అంటూ ప్రచారం కూడ ఆ జరిగింది. అలాంటి అరియానా పెళ్లి.. ప్రేమ విషయంలో బయట ఉన్న పుకార్లకు చెక్ పెట్టేలా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడింది. ఆ ఇంటర్వ్యూలో.. అవినాష్ తో నాది కేవలం స్నేహం మాత్రమే. మేము ఇద్దరం మంచి స్నేహితులుగా ఇంట్లో కొనసాగాం ఇకపై కూడా మంచి స్నేహితులుగా ఉంటాం. మా ఇద్దరి మధ్య అంతకు మించి ఏమీ ఉండదు అంటూ స్పష్టతనిచ్చింది. ఇక పెళ్లి గురించి ప్లాన్స్ ఏంటీ అంటూ ప్రశ్నించిన సమయంలో.. నేను ఎక్కువగా మాట్లాడుతాను కనుక వచ్చే వాడు కాస్త సైలెంట్ అయితే బెటర్. అతడు నాపై ఎక్కువ ప్రేమను చూపించాలి. పెళ్లి తర్వాత కూడా జాబ్ చేస్తాను కనుక రాత్రి సమయంలో షూట్ అయిపోగానే వచ్చి పికప్ చేసుకోవాలి కాని పదే పదే కాల్ చేసి ఇంకా ఎంత సేపు అంటూ విసిగించొద్దు. నన్ను పూర్తిగా అర్థం చేసుకుని పూర్తి కంఫర్ట్ ఇచ్చే వాడు కావాలని అరియానా కోరుకుంటుందట. మరీ ఇన్ని మంచి లక్షణాలు ఉన్న వాడు దొరకాలంటే కష్టమే కదా అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## రాణి వేలు పాత్రలో నయన్ నటించడం లేదట



తమిళం మరియు తెలుగులో వరుసగా భారీ ప్రాజెక్ట్ లు చేస్తున్న నయనతార లేడీ సూపర్ స్టార్ అంటూ పిలిపించుకుంటుంది. వరుసగా ఈమె తమిళంలో లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో నటిస్తుంది. ఇటీవల ఈమె తమిళ వీర నారి రాణీ వేలు నచియార్ బయోపిక్ లో నటించబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. తమిళనాడు ప్రజలు ఎంతో గౌరవించే ఆమె పాత్రలో నయన్ నటించబోతున్నట్లుగా వస్తున్న వార్తలు వైరల్ అవుతుండటంతో అభిమానులు రకరకాలుగా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో ఆమె టీం వార్తలపై స్పందించింది. రాణీ వేలు నచియార్ బయోపిక్ లో నయనతార నటిస్తున్నట్లుగా వస్తున్న వార్తలు నిజం కాదు. ఆమె వద్దకు అలాంటి ప్రాజెక్ట్ ఏమీ రాలేదు. అసలు అలాంటి పీరియాడిక్ మూవీస్ కూడా ఏమీ నయన్ చేయడం లేదని ప్రెస్ నోట్ లో పేర్కొన్నారు. మీడియాలో వస్తున్న వార్తలు నమ్మవద్దని ఏదైనా సినిమా ఉంటే ఆమె నుండి స్వయంగా ప్రకటన వస్తుందని పుకార్లను నమ్మవద్దంటూ ఆమె టీం పేర్కొంది. ప్రస్తుతం రజినీకాంత్ అన్నాత్తే సినిమాలో నయన్ నటిస్తున్న విషయం తెల్సిందే.

## బాలయ్యతో పనిచేసే అంత బరువు పెరిగాను:హీరోయిన్ తనుశ్రీ



టాలీవుడ్ నటసింహం బాలయ్య పక్కన నటించే హీరోయిన్స్ అంటే అందంతో పాటు డాన్స్ గ్లామర్ అన్ని ఉండాలి. బాలయ్యతో సినిమా అంటేనే ఒక ఎనర్జీ.. హీరోయిన్లను సినిమాలలో ఎంత ఆటపట్టిస్తాడో.. బయట అంత రెస్పెక్ట్ ఇస్తాడు. అలాంటిది బాలయ్యతో నటించిన వీరభద్ర సినిమా గురించి పదిహేనేళ్ల తర్వాత గుర్తు చేసింది బాలీవుడ్ బ్యూటీ తనుశ్రీ దత్త. ఈ భామ తెలుగులో చేసింది ఒకే ఒక్క సినిమా అది కూడా వీరభద్రనే. ఆ సినిమా తర్వాత బాలీవుడ్ వైపు వెళ్ళిపోయింది. కానీ మళ్లీ తెలుగు వైపు తిరిగి చూడలేదు. తెలుగు మేకర్స్ కూడా ఆమెను సంప్రదించలేదు. అయితే ఇన్నేళ్ల తర్వాత మళ్లీ అమ్మడి బాలయ్యతో సినిమా ఎక్స్పీరియన్స్ గురించి మాట్లాడింది. అంతేగాక బాలయ్యతో సినిమా చేస్తే లావు అవుతారు అంటూ షాకిచ్చింది. ఇప్పుడు మళ్లీ కొత్తగా కెరీర్ స్టార్ట్ చేద్దామని చూస్తుందట తనుశ్రీ. ఈ అమ్మడు కాస్టింగ్ కౌచ్ పై ఆరోపించడం వలన బాలీవుడ్ లో అవకాశాలు రాక ఖాళీగా ఉంటోందట. అందుకే ఇప్పుడు మళ్లీ సినిమాల మీద ఫోకస్ పెడదాం అనేసి టాలీవుడ్ వైపు తిరిగి చూస్తోంది. అమ్మడు టాలీవుడ్ ఇండస్ట్రీని ఆకాశంలో పెడుతోంది. బాలీవుడ్ కంటే కంటెంట్ పరంగా టాలీవుడ్ ఇండస్ట్రీ చాలా బెటర్ అంటోంది. ఇక తనకు పాపులారిటీ తెచ్చింది కూడా తెలుగు సినిమానే అంటోంది. బాలయ్య పక్కన హీరోయిన్ గా చేసినప్పుడు చాలా లావు అయ్యానని అంటోంది. మంచి క్యారెక్టర్స్ వస్తే టాలీవుడ్ లో నటించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అలాగే హీరోయిన్ పాత్రలే కాకుండా కంటెంట్ నచ్చితే విలన్ వదిన పాత్రలు చేయడానికి కూడా తనకు అభ్యంతరం లేదంటోంది. వీరభద్ర సినిమా టైంలో రోజు బాలయ్య ఇంటి భోజనం వచ్చేదని అది తినే నేను 5కిలోల బరువు పెరిగిందట. ఇక ప్రస్తుతం అవకాశం కోసం ఎదురు చూస్తుంది. టాలీవుడ్ లో మాత్రం అమ్మడికి ఛాన్స్ దొరకడం కష్టమే అనిపిస్తుంది.

## "ఖిలాడి"కు మరింత ఎనర్జిటిక్ గా మాస్ మహారాజ్.!




మన టాలీవుడ్ లో ఎనర్జీకు కేరాఫ్ అడ్రెస్ ఎవరన్నా ఉన్నారు అంటే అది మాస్ మహారాజ్ రవితేజ అని చెప్పాలి. తన కో స్టార్స్ ఎందరో ఆ విషయాన్ని చెప్పారు. మరి అందుకు తగ్గట్టుగానే మాస్ మహారాజ్ రవితేజ తన లేటెస్ట్ చిత్రం "క్రాక్"ను శరవేగంగా పూర్తి చేసేసారు. ఇక ఇది లైన్ లోన్ ఉండగానే మరో సాలిడ్ యాక్షన్ డ్రామా "ఖిలాడి" చిత్రాన్ని లైన్ లో పెట్టేసారు. రమేష్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఇటీవలే ఒక సాలిడ్ యాక్షన్ సన్నివేశాన్ని కేజీయఫ్ ఫైట్ మాస్టర్స్ సమక్షంలో జరిగింది. మరి అలాగే లేటెస్ట్ టాక్ ప్రకారం ఈ చిత్రాన్ని వచ్చే రెండు నెలలు పూర్తి అయ్యే సరికి 50 శాతం మేర రవితేజ కంప్లీట్ చేసేస్తారని తెలుస్తుంది. అంతే కాకుండా ఈ షూట్ లో సీనియర్ నటుడు శరత్ కుమార్ ఒక కీలక పాత్ర పోషించనున్నట్టు తెలుస్తుంది. మొత్తానికి మాత్రం ఈ సినిమాను కూడా రవితేజ తనదైన ఎనర్జీతో సాధ్యమైనంత త్వరగా కంప్లీట్ చేసెయ్యడం ఖాయం చెప్పాలి. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా పెన్ మూవీస్ ఏ స్టూడియోస్ వారు సంయుక్తంగా నిర్మాణం వహిస్తున్నారు.

## జెర్సీ దర్శకుడితో మెగాహీరో మూవీ చేయనున్నాడా..?




మెగాపవర్ స్టార్ రాంచరణ్ ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో ఆర్ఆర్ఆర్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా 2021 ద్వితీయార్థంలో విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. దాదాపు ఆర్ఆర్ఆర్ మూవీకి మరో మూడు నెలల టైం పడుతుందని అంటున్నారు. అయితే ఆర్ఆర్ఆర్ తర్వాత మెగా హీరో రాంచరణ్ తదుపరి సినిమా ఎవరితో చేస్తాడనేది ఆసక్తిగా ప్రశ్న. ఇప్పటిదాకా పలువురి పేర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టినా.. ఇప్పటికే ఎన్టీఆర్ నెక్స్ట్ సినిమా త్రివిక్రమ్ తో ప్లాన్ చేసాడు. మరి ఇప్పుడు రాంచరణ్ సంగతి ఏంటని చర్చ. ఇదిలా ఉండగా ఆ మధ్యలో జెర్సీ ఫేమ్ దర్శకుడు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రాంచరణ్ సినిమా చేయబోతునట్లు టాక్ వినిపించింది. అయితే అందులో వాస్తవం లేదని చెప్పేసరికి ఆ న్యూస్ కనుమరుగయింది. ఈ టైంలో రాంచరణ్ నెక్స్ట్ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన న్యూస్ సోషల్ మీడియాలో హల్చల్ చేస్తుంది. టాలీవుడ్ ఇండస్ట్రీలోని ఓ బడా నిర్మాత.. టాలీవుడ్ హిట్ మూవీ డైరెక్టర్ కి అడ్వాన్స్ ఇచ్చి రాంచరణ్ కోసం మంచి కథని సిద్ధం చేయించినట్లు తెలుస్తుంది. ఆ కథ పై అనేక ఊహాగానాలు వ్యక్తం అవుతుండగా.. చరణ్ నెక్స్ట్ మూవీలో పోలీస్ అధికారి పాత్ర చేయనున్నాడని టాక్. అయితే గౌతమ్ తీయబోయే సినిమా ఇదేనా కాదా అనే సినీవర్గాలలో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సినిమా కమర్షియల్ జోనర్ లో ఉంటూనే హెవీ ఎమోషనల్ ఎలిమెంట్స్ తో ఉండబోతుందని సమాచారం. అయితే బయటికి రాకపోయినా లోపల లోపల గౌతమ్ చరణ్ ల మధ్య డిస్కషన్స్ నడుస్తున్నాయట. మరి అదే గనక నిజమైతే మెగా ఫ్యాన్స్ ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. అసలు విషయాలు తెలుకోవాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే!

## సమంత న్యూ ఇయర్ గిఫ్ట్!



ఇన్నాళ్లూ వెండితెర మీద మెరిసిన అక్కినేని కోడలు సమంత ప్రస్తుతం డిజిటల్ వేదిక మీద దృష్టి సారించింది. ప్రముఖ ఓటీటీ ఆహా కోసం సమంత నిర్వహిస్తున్న సెలబ్రిటీ టాక్ షో సామ్ జామ్ మంచి ఆదరణ దక్కించుకుంటోంది. ఇక, కొత్త సంవత్సరంలో సమంత తన అభిమానులకు మరో బహుమతి అందించబోతోంది. సమంత కీలక పాత్ర పోషించిన వెబ్ సిరీస్ ఫ్యామిలీ మేన్-2 కొత్త సంవత్సరంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ విషయాన్ని సమంత ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపింది. ఈ వెబ్ సిరీస్‌లో సమంత నెగిటివ్ రోల్‌లో కనిపించబోతోంది. తీవ్రవాది పాత్రలో నటించినట్టు తెలుస్తోంది. రాజ్-డీకే ద్వయం రూపొందించిన ఫ్యామిలీ మేన్ వెబ్ సిరీస్ తొలి భాగం మంచి ఆదరణ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దానికి కొనసాగింపుగా త్వరలో ఫ్యామిలీ మేన్-2 రాబోతోంది.

## నితిన్ సినిమా ఇక తప్పుకున్నట్టే అనుకోవాలా.?

ఈ ఏడాది విడుదల కాబడ్డ చిత్రాలే కొన్ని మరి ఆ కొన్నింటిలో కూడా మంచ్చి హిట్ గా నిలిచిన వాటిలో టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ హీరోగా రష్మికా మందన్నా హీరోయిన్ గా నటించిన "భీష్మ" కూడా ఒకటి. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ చిత్రం నితిన్ కు మంచి కం బ్యాక్ ఫిల్మ్ గా నిలిచింది. ఇక ఈ సినిమా హిట్ తో తన నెక్స్ట్ "రంగ్ దే" కూడా మంచి విజయాన్ని అందుకోవాలని దానికి కూడా ఫుల్ స్వింగ్ లో పాల్గొన్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో కీర్తి సురేష్ హీరోయిన్ గా క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా ఈ చిత్రాన్ని ప్లాన్ చేసారు. ఇక అలాగే లాక్ డౌన్ సమయంలో కూడా ఈ సినిమా షూటింగ్ నే మొదటగా స్టార్ట్ చేసి ఎట్టి పరిస్థితుల్లో వచ్చే ఏడాది సంక్రాంతి రేస్ లో నిలబెడుతున్నామని అధికారిక ప్రకటన ఇచ్చారు. కానీ ఇప్పుడు ఈ సినిమా అనౌన్స్మెంట్ ఇచ్చిన సమయానికి డైలమాలో ఉన్న పలు ప్రాజెక్ట్ లే విడుదల తేదీలను ప్రకటించేసి విడుదలకు ఎప్పుడు చేద్దామా అని రెడీగా ఉన్నారు. కానీ వీరి చిత్ర యూనిట్ నుంచి ఆ ఊసే ఇప్పుడు వినబడకపోవడం గమనార్హం. మిగతా సినిమాలు ఇప్పటికే ప్రమోషన్స్ కూడా స్టార్ట్ చేసేశాయి. కానీ వీరి నుంచి ఆ వైబ్రేషన్స్ లేవు. మరి ఈ చిత్రం సంక్రాంతి రేస్ నుంచి తప్పుకున్నట్టే అనుకోవాలా అన్న డౌట్స్ వస్తున్నాయి. మరి ఈ చిత్రాన్ని ఎప్పుడు విడుదల చేస్తున్నారో చూడాలి. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989